# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 4-3-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 177 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## కరోనా మరణాలు నిరోధించడంలో టీకాలు కీలకం : కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 3: భారత్‌లో 2022లో నమోదైన కొవిడ్-19 మృతుల్లో 92 శాతం టీకా తీసుకోని వారే ఉన్నారని కేంద్ర ప్రభుత్వం గురువారం స్పష్టం చేసింది.

దేశంలో కరోనా వైరస్ తగ్గుముఖం పట్టిందని ఈ దిశగా వ్యాక్సినేషన్ ప్రక్రియ కీలక పాత్ర పోషించిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ అన్నారు. భారత్‌లో కొవిడ్-19 కేసుల్లో భారీ తగ్గుదల నమోదవుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా రోజుకు సగటున దాదాపు 11,000 కొవిడ్ కేసులు వెలుగుచూస్తున్నాయని అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో భారత్ నుంచి కేవలం 0.7 కేసులే వెలుగుచూస్తున్నాయని తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో మరణాల సంఖ్య తక్కువగా ఉందని, ఇది సానుకూల పరిస్థితికి సంకేతమని ఆయన చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 2-8 వరకూ సగటున 615 మరణాలు నమోదవగా గత వారం సగటున 144 మరణాలు వెలుగుచూశాయని తెలిపారు. దీంతో కొవిడ్-19 ముమ్మర దశ కంటే 76.6 శాతం తీవ్రత తగ్గినట్టు వెల్లడవుతోందని అన్నారు. వారంలో సగటు కరోనా పాజిటివిటీ రేటు 0.99 శాతానికి పడిపోయిందని చెప్పారు.

# భారీ పేలుళ్లతో దద్దరిల్లిన కీవ్



కీవ్, మార్చి 3:: రష్యా దూకుడు పెంచింది. నిన్న రాత్రి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై విరుచుకుపడింది. రెండు చోట్ల అత్యంత శక్తివంతమైన పేలుళ్లు జరిగాయి. కీవ్‌తో పాటు ఇతర ఉక్రెయిన్ నగరాల్లోనూ నిన్న రాత్రి భీకర దాడులు జరిగాయి. అయితే తెల్లవారుజామున 3 గంటల సమయంలో నాలుగు సార్లు భారీ పేలుళ్ల శబ్దాలు కీవ్‌లో వినిపించాయి. దాడుల సమయంలో ఆకాశం వెలుతురుతో నిండిపోయింది. కొన్ని చోట్ల ఆ సంఘటనలు వీడియోలకు చిక్కాయి. అయితే కీవ్‌లో రష్యా సేనలు దేన్ని టార్గెట్ చేశాయో స్పష్టం కావడం లేదు. ఆ భారీ పేలుళ్లో ఎంత మంది మరణించారు, ఎంత మంది గాయపడ్డారన్న విషయం కూడా ఇంకా తెలియదు. నిన్న కీవ్ సెంట్రల్ రైల్ స్టేషన్ వద్ద భారీ పేలుడు జరిగింది. రష్యా దాడుల నుంచి ఓ షెల్టర్‌లో వందల మంది తలదాచుకుంటున్న ప్రాంతంలో ఆ పేలుడు జరిగింది. రష్యా వదిలిన మిస్సైల్‌ను ఇంటర్‌సెప్టార్‌తో అడ్డుకున్నామని, దాని శకలం వచ్చి ఆ ప్రాంతంలో పడినట్లు ఉక్రెయిన్ బలగాలు చెబుతున్నాయి.

## ఉక్రెయిన్ యుద్ధంలో టాప్ మేజర్ జనరల్‌ను కోల్పోయిన రష్యా

కీవ్, మార్చి 3:: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు భారీ నష్టం జరిగింది. మేజర్ జనరల్ ర్యాంక్ ఆఫీసర్ ఆండ్రీ సుఖొవెట్‌స్కీయి ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధంలో రష్యా దళాలు అత్యున్నత స్థాయి నేతను కోల్పోవడం ఇదే మొదటిసారి. రష్యన్ ఎయిర్‌బోర్న్ ట్రూప్స్ మౌంటెన్ ఎయిర్ అజాల్ట్‌కు చెందిన నోవోరోస్సియ్‌స్క్ గార్డ్స్ కమాండర్‌గా ఆండ్రీ సేవలందించారు. ఈ వార్తను రష్యా అధికారికంగా ధ్రువీకరించవలసి ఉంది.

ఈ యుద్ధంలో 498 మంది సైనికులను కోల్పోయినట్లు రష్యా ప్రకటించింది. అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ విడుదల చేసిన ప్రకటనలో 9,000 మందికిపైగా రష్యన్ సైనికులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఈ యుద్ధం గురువారం ఎనిమిదో రోజుకు చేరింది.

## ఛేర్నివ్ ఆయిల్ డిపోను ధ్వంసం చేసిన రష్యా



కీవ్, మార్చి 3::ఉక్రెయిన్ పై రష్యా విరుచుకుపడుతోంది. ఛేర్నివ్ ఆయిల్ డిపోను ధ్వంసం చేసింది రష్యా. ఛేర్నివ్ ను రష్యా పూర్తిగా హస్తగతం చేసుకుంది. ప్రధాన నగరాలపై క్షిపణులు, బాంబులతో దాడులు చేస్తోంది. అమెరికా అండతోనే ఉక్రెయిన్ రెచ్చిపోతోందని రష్యా మండిపడింది. జెలెన్ స్కీ అమెరికా చేతిలో కీలుబొమ్మని తెలిపారు.

## సీఎం కేసీఆర్‌తో సుబ్రమణియన్ స్వామి, రాకేశ్ తికాయత్ భేటీ



హైదరాబాద్, మార్చి 3:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్‌తో బీజేపీ నాయకులు, రాజ్యసభ సభ్యులు సుబ్రమణియన్ స్వామి, భారతీయ కిసాన్ యూనియన్ నాయకులు రాకేశ్ తికాయత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులతో పాటు భవిష్యత్ రాజకీయాలపై చర్చించారు. కేసీఆర్‌తో కలిసి సుబ్రమణియన్ స్వామి, రాకేశ్ తికాయత్ లంచ్ చేశారు. వారితో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలతో జాతీయ స్థాయి కూటమిని ఏర్పాటు చేసేందుకు వివిధ పార్టీల మద్దతు కూడగట్టే పనిలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇటీవలే మహారాష్ట్రలో పర్యటించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ థాకరేతో పాటు ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌తో కేసీఆర్ సమావేశమై జాతీయ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం : డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 3:కాంగ్రెస్ పార్టీ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి స్పందించారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని డీజీపీ స్పష్టం చేశారు. తనను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపించిందని రేవంత్ చేసిన ఆరోపణలు ఏ మాత్రం వాస్తవం కాదని మహేందర్ రెడ్డి తేల్చిచెప్పారు.

ఇటీవల తన ఇంట్లో తాను జారిపడటంతో ఎడమ భుజానికి గాయమైందని డీజీపీ తెలిపారు. భుజం పైన మూడు చోట్ల ఫ్యాక్చర్స్ అయినట్లు ఎక్స్ రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ రిపోర్టులలో తేలింది. దీంతో భుజం కదలకుండా కట్టు కట్టారు వైద్యులు. దీంతో విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 18 నుంచి మార్చి 4వ తేదీ వరకు సెలవులో ఉన్నారు. వైద్యుల సలహా మేరకు విధుల్లో చేరడం జరుగుతుందన్నారు డీజీపీ. భుజానికి అవసరమైన వ్యాయామం, ఫిజియోథెరపీ, మందులను వాడడం జరుగుతోందని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

### రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా..

ఈ వాస్తవాలు తెలుసుకోకుండా తనను ప్రభుత్వం బలవంతంగా సెలవులో పంపించిందంటూ రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేయడంపట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నానని మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర పార్టీ నాయకుడిగా ఉన్న రేవంత్ రెడ్డి అవాస్తవాలు ప్రచారం చేయడం భావ్యం కాదు. తమ రాజకీయ అవసరాలకు ప్రభుత్వ అధికారులపై ఈవిధమైన అసత్య ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని డీజీపీ పేర్కొన్నారు.

### సంయమనం పాటించాలి..

ఒక ఉన్నత స్థాయిలో, బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న సీనియర్ అధికారిపై ఈ విధమైన ఆరోపణలను చేయడం ఆక్షేపణీయమే కాకుండా ప్రభుత్వంపై అపోహలు కలిగే అవకాశం ఉందన్నారు. ఈ తప్పుడు ఆరోపణలు పోలీస్ శాఖ స్థైర్యాన్ని దెబ్బతీయడంతోపాటు, రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగిస్తాయన్నారు. ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు, ఇతర అధికారులపై ఆరోపణలు చేసేటప్పుడు విచక్షణ, సంయమనం పాటించాలని కోరుతున్నట్లు డీజీపీ తెలిపారు.

## ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం కనుగొంటాం : రష్యా విదేశాంగ మంత్రి

మాస్కో, మార్చి 3: ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం లభిస్తుందనడంలో తనకు ఎలాంటి సందేహం లేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్రోవ్ పేర్కొన్నారు. రష్యా ప్రాథమిక డిమాండ్లనే ముందుంచిందని చెప్పారు. దేశ భద్రతకు సవాల్ విసిరేందుకు ఉక్రెయిన్‌ను రష్యా అనుమతించబోదని స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాల మధ్య తదుపరి దశ చర్చలు గురువారం సాయంత్రం జరుగుతాయని తెలిపారు.ఉక్రెయిన్, యూరప్ ప్రాంతానికి భద్రతా హామీలపై చర్చించేందుకు రష్యా సిద్ధంగా ఉందని అన్నారు. పాశ్చాత్య నేతలు అణు యుద్ధంపై చర్చిస్తున్నారని అయితే ఇలాంటి ఆలోచనలు రష్యన్లలో లేవని ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఉక్రెయిన్ యుద్ధం తీవ్రతరం కావడంతో ఎస్-400 మిసైల్స్‌ను రంగంలోకి దించేందుకు రష్యా కసరత్తు ముమ్మరం చేసింది.

ఎస్-400 యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిసైల్ సిస్టమ్స్ సిబ్బంది నొవొసిబిర్క్ ప్రాంతంలో శత్రు లక్ష్యాలను ఛేదించేందుకు శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాయి. ఇక గురువారం రష్యా-ఉక్రెయిన్ వార్ ఎనిమిదో రోజుకు చేరింది. రష్యా దురాక్రమణ మొదలైనప్పటి నుంచి దాదాపు 2000 మందికి పైగా పౌరులు మరణించారని ఉక్రెయిన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీసుల విభాగం వెల్లడించింది. మరోవైపు ఉక్రెయిన్ నుంచి రష్యన్ సేనల ఉపసంహరణకు అనుకూలంగా ఐక్యరాజ్యసమితి బుధవారం ఓటు చేసింది.

ఉక్రెయిన్‌లో రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌పై రష్యన్ బాంబుల మోత కొనసాగుతుండటంతో నగరాన్ని తక్షణమే భారతీయులందరూ ఖాళీ చేయాలని ఇండియన్ ఎంబసీ కోరింది.కాగా, ఉక్రెయిన్‌పై దాడులతో విరుచుకుపడుతున్న పుతిన్‌ను యుద్ధ నేరస్తుడిగా బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ అభివర్ణించారు. పౌర స్థావరాలపై రష్యా బాంబులు కురిపిస్తున్న క్రమంలో పుతిన్‌పై ఆయన మండిపడ్డారు. ఉక్రెయిన్‌పై దాడిని ఆపాలని చర్చలు పునరుద్ధరించాలని పాశ్చాత్య దేశాలు డిమాండ్ చేస్తుండగా రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రధాన నగరాల్లో రష్యన్ సేనలు కాల్పులతో విరుచుకుపడుతున్నాయి.

## ఇండ్లు అమ్మే ప్రసక్తే లేదు.. ఆస్తిని కాపాడుకోవాల్సింది మీరే

హైదరాబాద్, మార్చి 3:డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్దిదారుల ఆనందం చూస్తుంటే.. కడుపు నిండినంతా పనైందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఓల్డ్ మారేడ్‌పల్లిలో నిర్మించిన 468 డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే సాయన్న కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ఇండ్లను అమ్మే ప్రసక్తే లేదు. ఈ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదేనని అన్నారు. అత్యంత విలువైన 5 ఎకరాల 18 గుంటల స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించామని తెలిపారు. ఈ భూమి ధర గజానికి రెండున్నర లక్షలు ఉంటుందన్నారు. రూ. 350 కోట్ల విలువ చేసే ఈ స్థలాన్ని హౌసింగ్ బోర్డు నుంచి జీహెచ్ఎంసీకి అప్పగించారని తెలిపారు. ఇక్కడున్న నిరుపేదలకు ఇండ్లు కట్టించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని చెప్పారు. ఆ మేరకు ఇండ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఈ ఇల్లును ఒక ప్రయివేటు బిల్డర్ నుంచి కొంటే రూ. 70 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు అవుతోందన్నారు. ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఉదయం ట్విట్టర్‌లో ఈ ఫోటోలు పెడితే మిగతా రాష్ట్రాల ప్రజలు విపరీతంగా స్పందిస్తున్నారు. తమకు కూడా ఇలాంటి ఇండ్లు కట్టించే సీఎం ఉంటే బాగుండు అని అంటున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మాకుంటే బాగుండు అని అంటున్నారు. రూపాయి కూడా తీసుకోకుండా ఇలాంటి ఇండ్లు కట్టిస్తున్నారా అని సీఎం కేసీఆర్‌ను ప్రశంసిస్తున్నారు.

ఇల్లు కట్టి చూడు పెళ్లి చూసి చూడు అని పెద్దలు అంటుంటారు.



అలా కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తున్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇండ్లను నిర్మించి ఇస్తున్నాం. ఈ ఇండ్లు బ్రహ్మాండంగా ఉన్నాయని లబ్ధిదారులు సంబురంగా చెప్తున్నారు. ఇంతకు మించిన తృప్తి రాజకీయంలో దేనితో కూడా రాదు. కడుపు నిండినంతా పనైంది. సీఎం కేసీఆర్‌కు తప్పకుండా రుణపడి ఉంటాం. మీ అందర్నీ కేసీఆర్ కోటీశ్వర్లను చేశారు. ఈ ఇండ్లను అమ్మే ప్రసక్తే లేదు. ఈ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. విద్యుత్, నీటి సరఫరా ఏర్పాటు చేశామన్నారు. ఈ కాలనీని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మోడల్ కాలనీగా తీర్చిదిద్దాలి అని కేటీఆర్ సూచించారు.

## భారత్‌కు వంద శాతం హామీ ఇస్తున్నాం.. వాటిపై ప్రభావం పడదు: రష్యా

న్యూఢిల్లీ, మార్చి 3: రష్యా-ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్నది. గత ఎనిమిది రోజులుగా రష్యన్ సైన్యం ఉక్రెయిన్ నగరాలపై బాంబులు, క్షిపణులతో దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైనిక చర్యలు ప్రారంభించిన అనంతరం పలు దేశాల్లో మాస్కోపై ఆంక్షలు విధించాయి. ప్రస్తుతం రష్యా నుంచి భారత్ ఎస్-400 క్షిపణి వ్యవస్థ కొనుగోలుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. తొలి విడుత పంజాబ్ సెక్టార్‌లోకి క్షిపణి వ్యవస్థను సరఫరా చేసింది. అయితే, ప్రస్తుతం ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం నేపథ్యంలో భారత్‌తో డీల్‌పై సందిగ్ధం నెలకొంది.

ఈ క్రమంలో రష్యన్ రాయబారి డెనిస్ అలిపోవ్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలు మాస్కోపై విధించిన ఆంక్షలు భారత్‌కు ఎస్-400 క్షిపణి వ్యవస్థల సరఫరాపై ప్రభావం చూపవని, వందశాతం హామీ ఇస్తున్నామన్నారు. అయితే, ఆర్థిక సహకారానికి సంబంధించి, వాణిజ్యంపై విధించిన తీవ్రమైన ఆంక్షల ప్రభావం అంతిమంగా ఎలా ఉండబోతుందో చూద్దామన్నారు. తమ ఆర్థిక వ్యవస్థ స్థిరంగానే ఉందని, ప్రస్తుతం ఉన్న ఒత్తిడిని ఎదుర్కొంటామన్నారు. ఇదిలా ఉండగా.. 2018లో భారత్ రష్యాతో ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌ను కొనుగులో చేసేందుకు ఒప్పందం చేసుకుంది. అప్పటి అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిపాలన నుంచి హెచ్చరికలు ఉన్నప్పటికీ భారత్ ఒప్పందం చేసుకున్నది. ఇప్పటికే రష్యా మిస్సైల్ వ్యవస్థను సరఫరా ప్రారంభించింది.

ఎస్-400 ట్రయాంఫ్ అనేది భూమిపై నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ. దీన్ని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కూడా మోహరించవచ్చు. ఆకాశంలో దూసుకొచ్చే శత్రువుల జెట్స్, రాకెట్లను ఇది భూమిపై నుంచే కూల్చివేయగల సామర్థ్యం వీటికి ఉంది. విమానాలు, మానవరహిత వైమానిక విమానాలు, క్రూయిజ్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది. ఇది టెర్మినల్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తక్షణమే వీటిని 1993లో అభివృద్ధి చేయడం ప్రారంభించారు.

## సెమీకండక్టర్ రంగంలో స్వయంసమృద్ధి సాధించాలి : మోదీ

న్యూఢిల్లీ, మార్చి 3: అత్యంత ముఖ్యమైన రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం మినహా భారత దేశానికి మరొక దారి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సెమీకండక్టర్లు వంటి కీలకాంశాల్లో స్వయంసమృద్ధి కోసం కృషి చేయడం వల్ల 'మేక్ ఇన్ ఇండియా' పథకం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించిన నేపథ్యంలో జరిగిన వెబినార్‌లో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యాభివృద్ధి శాఖ 'ప్రపంచం కోసం మేక్ ఇన్ ఇండియా' శీర్షికతో ఈ వెబినార్‌ను నిర్వహించింది. మోదీ మాట్లాడుతూ, సెమీకండక్టర్ల విషయానికి వచ్చేసరికి స్వయం సమృద్ధి సాధించడం మినహా భారత దేశానికి మరొక దారి లేదన్నారు. ఈ రంగం 'మేక్ ఇన్ ఇండియా'కు నూతన అవకాశాలను తీసుకొచ్చిందని చెప్పారు.

మన దేశంలోని ముడి ఇనుప ఖనిజం విదేశాలకు వెళ్తోందని, నాణ్యమైన ఉక్కును మనం ఆ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. దిగుమతులు సాధ్యమైనంత తక్కువగా ఉండేవిధంగా ఇండియన్ మాన్యుఫ్యాక్చరర్స్ కృషి చేయాలని, ఇతర దేశాలపై ఆధాపడవలసిన అవసరాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. భారత దేశం వంటి అతి పెద్ద దేశం కేవలం మార్కెట్‌గా మిగిలిపోతే, ఎన్నటికీ అభివృద్ధి చెందబోదని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం సాధ్యం కాదని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు ఏ విధంగా ధ్వంసమయ్యాయో మనం చూశామన్నారు. ప్రపంచం భారత దేశాన్ని ఓ మాన్యుఫ్యాక్చరింగ్ పవర్ హౌస్‌గా చూస్తోందని తెలిపారు. దేశ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)లో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం వాటా 15 శాతమని, అయితే 'మేక్ ఇన్ ఇండియా'లో అనంతరమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మాన్యుఫ్యాక్చరింగ్ బేస్‌ను బలోపేతం చేయడానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పేద కుటుంబానికి మంత్రి తలసాని చేయూత



హైదరాబాద్, మార్చి 3: అసలే పేదరికం...ఆపైన అతి చిన్న వయసు కలిగిన తమ కుమారుడికి వచ్చిన వ్యాధి గురించి వైద్యులు చెప్పిన విషయం ఆ కుటుంబ సభ్యులను షాక్ కు గురి చేసింది. వారి కుటుంబానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌అండగా నిలిచారు. చంపా పేట్ కు చెందిన జంగయ్య, యశోద దంపతుల కుమారుడు శివతేజ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో శివతేజ్ ను నిమ్స్ వైద్యుల వద్దకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ గా గుర్తించారు. చికిత్స కోసం 5 లక్షల రూపాయల వరకు అవుతుందని, వీలైనంత త్వరగా శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. దిక్కుతోచని స్థితిలో ఉన్నవారు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఆశ్రయించి తమ ఇబ్బందిని వివరించారు. తక్షణమే స్పందించిన మంత్రి శ్రీనివాస్ యాదవ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2.50 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరైనది. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన నివాసంలో బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం మంజూరు పత్రం ఎల్ వో సీని మంత్రి అందజేశారు.

## ఆపరేషన్ గంగతో వేగంగా తరలింపు.. విద్యార్థులకు స్వాగతం పలికిన కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 3: ఆపరేషన్ గంగ ద్వారా ఉక్రెయిన్ నుంచి భారత విద్యార్థులను వేగంగా తరలిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం ఉక్రెయిన్ నుంచి వచ్చిన విద్యార్థులకు ఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అక్కడి భయానక పరిస్థితులను అధిగమించి విద్యార్థులు విజయవంతంగా స్వదేశానికి చేరుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం విద్యార్థులు ఆయనతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న వారందరినీ తిరిగి తీసుకొచ్చే వరకూ ఆపరేషన్ గంగ ఆగదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళనలకు గురి కావద్దని కోరారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ రూపించెడి దీపమయిన
దీపించెడి రూపమయిన తేజస్విని పై
శ్రీ పద వరములను గురిసి
కాపాడును "కమలనీవు" హర్షోల్లాసిని!!

(మార్చి 4 నటి కమిలినీ ముఖర్జీ పుట్టిన రోజు...)



-రాధశ్రీ
సెల్: 9494481210

# కార్మిక కర్షక వర్గాల భద్రత, ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

## (04 మార్చి 'జాతీయ భద్రత దినం' సందర్భంగా)

శ్రామికవర్గాల భద్రత, ఆరోగ్యం, అనుకూల కార్యక్షేత్ర వాతావరణం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 04 మార్చిన దేశవ్యాప్తంగా 'జాతీయ భద్రత దినం (నేషనల్ సేఫ్టీ డే)' పాటించుట 1972 నుండి ఆనవాయితీగా మారింది. ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు, పలు ఉపాధులు/వృత్తులు చేసుకునే సామాన్య ప్రజల ఆరోగ్యం, శ్రమ క్షేత్రంలో భద్రత, ప్రమాద లేమి, రోడ్డు భద్రత, పని ప్రదేశ సానుకూల వాతావరణం లాంటి అంశాల పట్ల తగు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల బాధ్యతగా గుర్తించాలి. శ్రామిక, కార్మిక లోకం అత్యంత ప్రమాదకర వాతావరణాల్లో పని చేయాల్సి ఉంటుంది. చిన్న పొరపాటు జరిగిన ప్రాణాపాయం పొంచి ఉంటుందని గమనించి యాజమాన్యాలు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. శ్రామికుల ఆరోగ్యమే సంస్థల ప్రయోజనాలకు, సంక్షేమానికి పునాదులని మరువరాదు. పని ప్రదేశంలో ప్రమాదాల నిర్మూలనకు తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలను ఖర్చులకు వెరవకుండా పాటించవలసిన బాధ్యత పరిశ్రమల యాజమాన్యాలదే అని నమ్మాలి. కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించే లాభాలు నిరర్థకమని యజమానులు గమనించాలి. ఇండియాలో కార్మిక మంత్రిత్వశాఖ చొరవతో స్వయం ప్రతిపత్తితో ఏర్పడిన 'నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (భారత జాతీయ భద్రత మండలి)' పర్యవేక్షణలో శ్రామికవర్గాల పని క్షేత్ర భద్రతకు సంబంధించిన అవగాహనలు, సూచనలు, పర్యవేక్షణలు లాంటి అంశాలను చర్చించడం జరుగుతోంది.

04 మార్చి 1966న పారిశ్రామిక భద్రతను దృష్టిలో ఉంచుకొని 8000 సభ్యుల సభ్యత్వంతో ఏర్పడిన 'నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ద్వారా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగ, శ్రామిక వర్గాల భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాల పట్ల ముందస్తు జాగ్రత్తలు పర్యవేక్షించబడతాయి. ఉద్యోగుల భద్రతకు అంకితభావం కలిగిన పారిశ్రామిక యాజమాన్యాలు ప్రధానమని, పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగి శ్రామికవర్గాలు తీవ్రంగా గాయపడడం, ప్రాణాలు సహితం కోల్పోవడం చూస్తున్నాం. పరిశ్రమల్లో ప్రమాదాల నిర్మూలన, అత్యవసర సేవల అనుక్షణ అందుబాటు, కాలానుగుణంగా ఉద్యోగులకు శిక్షణలు, భద్రతా ప్రమాణాల సదస్సులు, కార్యశాలలు, సేఫ్టీ ఆడిట్స్, ప్రమాదాల మూల్యాంకనలు, ప్రమాద నిర్వహణ, రోడ్డు భద్రతా వారోత్సవాల నిర్వహణ, అగ్నిమాపక వారోత్సవాలు, కార్మికులకు భద్రత పట్ల అవగాహన లాంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. ఇదే అంశాలను దృష్టిలో పెట్టుకొని 28 ఫిబ్రవరిన 'ప్రపంచ శ్రామికుల భద్రత, ఆరోగ్య జ్ఞాపకార్థ దినం' పాటించుట జరుగుతోంది. శ్రామిక లోకంలో వృత్తి సంబంధ వ్యాధులు, ప్రమాదాలు, అనారోగ్యాలు, చివరకు మరణాల పాలు కావడం తరుచుగా వింటున్నాం. పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంధ సంస్థలు, నియంత్రణ యంత్రాంగాలు 04 మార్చి వేదికగా పలు అవగాహన కార్యక్రమాలను, శిక్షణాశిబిరాలను నిర్వహిస్తారు. పారిశ్రామిక ఉత్పత్తుల నాణ్యతతో పాటు కార్మికుల భద్రత కూడా అంత కన్న ప్రధానమని యాజమాన్యాలు గమనించాలి. ఈ ఏడాది జాతీయ భద్రత దినం-2022 నినాదంగా 'సడక్ సురక్ష లేదా రోడ్ సేఫ్టీ' అనే అంశాన్ని తీసుకున్నారు.

భోపాల్ గ్యాస్ విషాదం (1984), విశాఖ గ్యాస్ లీక్ (2020), బాంబె డాక్ విస్ఫోటనం (1944), చెస్నాల మైనింగ్ డిజాస్టర్ (1975), కార్బె చిమ్ని కొలాప్స్ (2009), జైపూర్ ఆయిల్ డిపో ఫైర్ (2009), మియపురీ రేడియోలాజికల్ ఆక్సిడెంట్ (2010), విశాఖ రిఫైనరీ బ్లాస్ట్ (2013), నాగారం పైప్‌లైన్ విస్ఫోటనం (2014), బిలాయ్ స్టీల్ ప్లాంట్ గ్యాస్ లీక్ (2014), తుగ్లకాబాద్ గ్యాస్ లీక్ (2017), కాన్పూర్ అమోనియ లీక్ (2017), బెలూర్ క్లోరిన్ లీక్ (2017), బిలాయ్ స్టీల్ ప్లాంట్ లీక్ (2018) లాంటి పలు పారిశ్రామిక ప్రమాదాల్లో పలువురు కార్మికులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు గాయపడడంతో పాటు అనేకులు ప్రాణాలు సహితం కోల్పోవడం విచారకరం. మానవ వనరులు అమూల్యమైనవని, మనుషుల ప్రాణాలకు ప్రాధాన్యత అధికమని, లాభాలు/ఉత్పత్తులు/ నాణ్యతల కన్న శ్రామికవర్గ సంక్షేమమే మిన్నయని అందరం గట్టిగా నమ్మాలి. శ్రామికుల భద్రతకు, ఆరోగ్యాలకు పట్టం కట్టాలి.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ముంబయ్‌లో ఆదాయపన్ను శాఖ సోదాలు

న్యూఢిల్లీ, మార్చి 3:ఆదాయ పన్ను శాఖ ఫిబ్రవరి 25 న ముంబయ్ లో సోదాలు, స్వాధీనాలు చేపట్టింది. బృహన్ ముంబయ్ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు నిర్వహించే ఒక ప్రముఖుడు, అతడి సన్నిహితుల ఇళ్ళమీద దాడులు జరిపారు. ముంబయ్ నగరంలో మొత్తం 35 చోట్ల తనిఖీలు చేపట్టారు.

ఈ సోదాలలో అనేక అనుమానాస్పద పత్రాలు, ఖాళీ పత్రాలు, డిజిటల్ సాక్ష్యాలు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ విధంగా దొరికిన సాక్ష్యాలు ఆ కాంట్రాక్టర్లకు, ఆ వ్యక్తికీ మధ్య సంబంధాలను ధ్రువపరుస్తున్నాయి. రూ. 130 కోట్ల విలువ చేసే మూడు డజన్ల స్థిరాస్తుల వివరాలు కూడా బైటపడ్డాయి. అందులో కొన్ని వాళ్ళ పేర్ల మీద, మరికొన్ని బినామీల పేర్లమీద ఉన్నట్టు గుర్తించారు. అంతర్జాతీయ హవాలా లావాదేవీలలో, అక్రమ సంపాదనను విదేశాల పరిధిలోకి తరలించిన సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నారు. లెక్కకు రాని అనేక కోట్ల రూపాయల డబ్బుకు సంబంధించిన వివరాలున్న ఖాళీ పత్రాలు, రసీదులు, ఎక్సెల్ షీట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

కాంట్రాక్టర్ల విషయానికొస్తే, ఖర్చులు బాగా పెంచి చూపించటం ద్వారా పన్నుకు గురయ్యే ఆదాయాన్ని దాచినట్టు ఈ స్వాధీనం చేసుకున్న పత్రాలు నిర్ధారించాయి. ఇందుకోసం ప్రధానంగా సబ్ కాంట్రాక్ట్ ఖర్చులు బాగా పెంచి అధిక మొత్తానికి ఇన్వాయిస్ చేశారు. అదే సమయంలో న్యాయబద్ధం కాని ఖర్చులు చూపారు. కొన్ని సందర్భాలలో ఈ సంస్థలనుంచి నగదు తీసి కాంట్రాక్టులు పొందటం కోసం లంచాలు ఇచ్చారు. మరికొన్ని సందర్భాలలో లెక్కల్లో చూపని ఆస్తుల కొనుగోలుకు వాడారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఈ కాంట్రాక్టర్లు పైన పేర్కొన్న అవకతవకల ద్వారా దాదాపు రూ.200 కోట్ల మేరకు ఆదాయపు పన్ను ఎగవేశారు.

ఈ సోదాల సమయంలో లెక్కల్లో చూపని రూ. 2 కోట్ల నగదు, రూ.1.5 కోట్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు పురోగతిలో ఉంది.

## నా ఇంటిపై దాడి చేస్తారా?: జితేందర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 3:తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హత్యకు కుట్ర కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఈ వ్యవహారంలో బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పాత్రపై పోలీసులు ఆరా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలోని నివాసం నుంచి తనను కిడ్నాప్ చేసేందుకు కొంతమంది గూండాలు యత్నించారని.. నేడు మహబూబ్ నగర్‌లోని నివాసంపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ దాడిలో తన కారు ధ్వంసం అయిందన్నారు. ఇల్లు తగుల బెట్టేందుకు ప్రత్నించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని జింతెందర్‌రెడ్డి ట్వీట్ చేశారు. మహబూబ్‌నగర్ పోలీసులకు, డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందన్నారు. సీబీఐతో దర్యాప్తు చేయించాలని.. ఒకవేళ టీఆర్ఎస్ సర్కారుకు సీబీఐపై నమ్మకం లేకపోతే న్యాయ విచారణ అయినా జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి రాజకీయాల్లో కొనసాగుతున్న తనపై ఇప్పటిదాకా చిన్న మచ్చ కూడా లేదని చెప్పిన జితేందర్ రెడ్డి.. మహబూబ్ నగర్ నుంచి ఎవరు ఢిల్లీ వచ్చినా తాను ఆశ్రయమిస్తానని కూడా చెప్పారు. తెలంగాణ కోసం ఉద్యమించిన వారికి ఆశ్రయం ఇచ్చి తీరాల్సిందేనని ఆయన చెప్పారు. తన ఇంటిలో ఆశ్రయం పొందాడని చెబుతున్న మున్నూరు రవి ప్రతి వారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌నూ కలుస్తుంటాడని కూడా జితేందర్ రెడ్డి చెప్పారు.

కాగా, మంత్రి శ్రీనివాస్ గౌడ్ హత్యకు కుట్ర చేసిన వారిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిలో మున్నూరు రవి అనే వ్యక్తి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డికి చెందిన ఢిల్లీ నివాసంలో ఆశ్రయం పొందాడని పోలీసులు తెలిపారు. నిందితుడు రవిని పోలీసులు అక్కడే అరెస్ట్ చేయడంతో మంత్రి హత్యకు జరిగిన కుట్రలో జితేందర్ రెడ్డితో పాటు బీజేపీకి చెందిన మహిళా నేత డీకే అరుణల పాత్రపైనా దర్యాప్తు చేపట్టనున్నట్లుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్న సంగతి తెలిసిందే.

## రూ. 25 కోట్లతో నారాయణఖేడ్ పట్టణ అభివృద్ధి : ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 3:పలు అభివృద్ధి పనుల నిమిత్తం నారాయణఖేడ్ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులతో నారాయణఖేడ్ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంజూరైన నిధులతో చేపట్టబోయే పనులను గుర్తించేందుకు గురువారం ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, మురికి కాల్వలు, నీటి సరఫరాను క్రమబద్ధీకరించడం, వీధి లైట్లు, తదితర అవసరాలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ప్రజావసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు వెచ్చిస్తామన్నారు. ఇప్పటికే రూ.15 కోట్ల నిధులతో ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. రెండు మూడు రోజుల పాటు మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో తాను స్వయంగా పర్యటించి సమస్యలను గుర్తించి పనులు చేపట్టే విధంగా అధికారులను ఆదేశిస్తామన్నారు.ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మూద రాంచందర్, మాజీ సర్పంచ్ ఎం.ఏ.నజీబ్, నాయకులు విఠల్, అభిషేక్ శెట్కార్, సత్యనారాయణ, పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు నగేశ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రవీందర్‌నాయక్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ పాల్గొన్నారు.పలు అభివృద్ధి పనుల నిమిత్తం నారాయణఖేడ్ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులతో నారాయణఖేడ్ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంజూరైన నిధులతో చేపట్టబోయే పనులను గుర్తించేందుకు గురువారం ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, మురికి కాల్వలు, నీటి సరఫరాను క్రమబద్ధీకరించడం, వీధి లైట్లు, తదితర అవసరాలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ప్రజావసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు వెచ్చిస్తామన్నారు. ఇప్పటికే రూ.15 కోట్ల నిధులతో ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు.

# క్రమశిక్షణతో ఇష్టపడి కష్టపడితే విజయాలు మీ వశమౌతాయి - యువతకు ఉపరాష్ట్రపతి ఉద్బోధ

న్యూఢిల్లీ, మార్చి 3:సమాజంలోని అన్ని రంగాల్లో పోటీ అనివార్యమైన ప్రస్తుత పరిస్థితుల్లో తమ తమ రంగాల్లో నైపుణ్యాన్ని సముపార్జించుకుని, క్రమశిక్షణతో, ఇష్టపడి కష్టపడడం ద్వారా విజయాలు సాధ్యమౌతాయని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు యువతకు దిశానిర్దేశం చేశారు.

విజయవాడ స్వర్ణభారత్ ట్రస్ట్ లో వివిధ వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, కార్యక్రమ అనంతరం వారికి సర్టిఫికేట్ లను ప్రదానం చేశారు.

ప్రతిభకు మారుపేరైన భారతీయ యువత ఉన్నతమైన కలలతో, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో కృషి చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో నైపుణ్యాన్ని సాధించడం ద్వారా అంతర్జాతీయంగా అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు.

యువత ఉపాధి కోసం ప్రభుత్వాల మీద మాత్రమే ఆధారపడ కూడదన్న ఉపరాష్ట్రపతి, వివిధ రంగాల్లో అనేక అవకాశాలు ఎదురు చూస్తున్నాయని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధిని అందించడం ద్వారా వారికి బంగారు భవిష్యత్తును అందించడమే గాక, వారు స్వయం ఉపాధి ద్వారా సొంత కాళ్ళ మీద నిలబడే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రైవేట్ రంగం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి ప్రత్యేకమైన యువశక్తిని నవభారత నిర్మాణంలో సారధ్యం వహించే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర భాయ్ మోదీ దృష్టి పెట్టడం అభినందనీయమన్న ఉపరాష్ట్రపతి, స్కిల్ ఇండియా కార్యక్రమం ద్వారా యువత అభివృద్ధి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. దీని కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.

యువతరం మహనీయుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించిన ఉపరాష్ట్రపతి, ఉన్నతమైన విలువలను అలవరచుకోవాలని సాటి వారి పట్ల సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో మూల భాగమైన నలుగురితో పంచుకోవడం, నలుగురి మేలు పట్ల శ్రద్ధ వహించడాన్ని (షేర్ అండ్ కేర్) యువత తమ జీవనసూత్రంగా అలవరచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవలసిన అవసరాన్ని నొక్కిచెప్పిన ఉపరాష్ట్రపతి, యువత మూలాల్లోకి తిరిగి రావాలని సూచించారు. ఆరోగ్య కరమైన ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి మీద దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో సాయంత్రం నడక సమయంలో వివిధ జాతులకు చెందిన పక్షులన్నీ కలిసి ఆహారాన్ని స్వీకరిస్తున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, సమాజంలో వ్యక్తుల మధ్యకూడా అదే విధమైన ఏకత్వం రావాలని ఆకాంక్షించారు. ఈ దిశగా వివక్షలకు తావులేని భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.

కార్యక్రమానికి ముందు విజయవాడకు చెందిన ఔత్సాహిక నృత్యకళాకారిని శ్రీమతి ఏల్చూరి స్నేహశర్మ నాట్యాన్ని ఉపరాష్ట్రపతి తిలకించారు. ఆమె ప్రదర్శించిన శ్రీ విఘ్నరాజమ్ భజే, త్రిపుర సంహారం, కాళీయ మర్దనం ఘట్టాలు ఎంతో ఆనందాన్ని పంచాయని తెలిపారు. ప్రదర్శిస్తున్న కళ మీదే శరీరం, దృష్టి, మనసు కేంద్రీకరించడం ద్వారా రససిద్ధి లభిస్తుందన్న అభినయ దర్పణంలోని మూల శ్లోకాన్ని ఉదహరించిన ఉపరాష్ట్రపతి, ఈ సూత్రం నాట్యానికేగాక, జీవితంలో ప్రతి సందర్భానికి వర్తిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో స్వర్ణ భారత్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఇతర ట్రస్టీలు, శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

# "సుస్థిర వృద్ధికి ఎనర్జీ" మార్చి 4న బడ్జెట్ వెబ్‌నార్

న్యూఢిల్లీ, మార్చి 3:కేంద్ర బడ్జెట్ 2022 ప్రకటనలను సమర్థవంతంగా మరియు వేగంగా అమలు చేయడానికి భారత ప్రభుత్వం వివిధ కీలక రంగాలలో వెబ్‌నార్ల శ్రేణిని నిర్వహిస్తోంది. ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలు, విద్యాసంస్థలు మరియు పరిశ్రమలకు చెందిన నిపుణులతో మేధోమథనం చేయడం మరియు వివిధ రంగాల క్రింద పలు కార్యక్రమాలను అమలు చేయడానికి ఉత్తమంగా ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై వ్యూహాలను గుర్తించడం దీని లక్ష్యం.

ఈ శ్రేణిలో భాగంగా విద్యుత్ మంత్రిత్వశాఖతో కూడిన వనరులపై సెక్టోరల్ గ్రూప్; పెట్రోలియం ఱ సహజ వాయువు; కొత్త ఱ పునరుత్పాదక ఇంధనం; బొగ్గు; గనులు; విదేశీ వ్యవహారాలు; మరియు పర్యావరణం, అటవీ ఱ వాతావరణ మార్పులపై బడ్జెట్ 2022లో ప్రకటించబడిన ఇంధనం మరియు వనరుల రంగంలో భారత ప్రభుత్వం యొక్క చొరవలను చర్చించడానికి మరియు ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఆలోచనలు మరియు సూచనలను పొందడానికి మార్చి 4, 2022 ఉదయం 10 గంటలకు "సస్టైనబుల్ గ్రోత్‌కు ఎనర్జీ'' అనే అంశంపై వెబ్‌నార్‌ను నిర్వహిస్తోంది.

కాప్ 26లో గౌరవనీయ ప్రధానమంత్రి సమర్పించిన పంచామృత వ్యూహానికి అనుగుణంగా తక్కువ-కార్బన్ అభివృద్ధి వ్యూహాన్ని ప్రోత్సహించడం ద్వారా భారతదేశం యొక్క శక్తి పరివర్తన ప్రయాణానికి బడ్జెట్ 2022 ఆధారం. దిగువ వివరించిన విధంగా బడ్జెట్ అనేక సమీప-కాల మరియు దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించింది:

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభ ప్లీనరీ సమావేశంలో ప్రసంగిస్తారు. ఈ వెబ్‌నార్ పైన గుర్తించిన విధంగా థీమ్‌ల క్రింద ఆరు సమాంతర బ్రేక్అవుట్ సెషన్‌లను కూడా కలిగి ఉంటుంది. సహకార ప్రక్రియలో భాగంగా, స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించే ఉద్దేశ్యంతో ఎనర్జీ మరియు వనరుల రంగంలో బడ్జెట్ 2022 ప్రకటనలతో సహా కీలక కార్యక్రమాలను అమలు చేయడానికి ఇందులో పాల్గొనేవారు నిర్దిష్ట చర్యలను నిర్వచిస్తారు.

# 46వ సివిల్ అకౌంట్స్‌డే సందర్భంగా ఈ-బిల్లు ప్రాసెసింగ్ వ్యవస్థను ప్రారంభించిన ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 3:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ 2022-23 కేంద్ర బడ్జెట్ లో ప్రకటించిన ఎలక్ట్రానిక్ బిల్లు (ఈ-బిల్లు) ప్రాసెసింగ్ వ్యవస్థను ఢిల్లీ లోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ఈ రోజు 46వ సివిల్ అకౌంట్స్ డే సందర్భంగా ప్రారంభించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్థిక మంత్రితో పాటు , ఆర్థిక కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్; కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సిజిఎ) ఆర్గనైజేషన్ హెడ్ శ్రీమతి సోనాలి సింగ్; అదనపు సిజిఎ (పిఎఫ్ఎంఎస్) శ్రీమతి ధరిత్రి పాండా, ప్రిన్సిపాల్ సిజిఎ (ఎంహెచ్ ఎ) శ్రీమతి భారతి దాస్ ఇంకా సి జి ఎ, ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ-బిల్ ప్రాసెసింగ్ సిస్టమ్ చొరవ గురించి మాట్లాడుతూ, విస్తృత పారదర్శకతను తీసుకురావడానికి ,చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఒడిబి), డిజిటల్ ఇండియా పర్యావరణ వ్యవస్థ'లో భాగమని అన్నారు. సరఫరాదారులు , కాంట్రాక్టర్లు తమ క్లెయింను ఆన్ లైన్ లో సమర్పించడానికి అనుమతించడం ద్వారా ఇది పారదర్శకత, సమర్థత , కాగితరహిత చెల్లింపు వ్యవస్థను పెంపొందిస్తుందని, ఇది వాస్తవ సమయ ప్రాతిపదికన ట్రాక్ చేయబడుతుందని ఆమె తెలిపారు.

సిజిఎ పోషించిన కీలక పాత్రను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ లావాదేవీలను అంతరాయం లేకుండా ఉంచడంలోను, సజావుగా చెల్లింపులు జరిగేలా చూడటంలోను ఇంకా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడం లో సిజిఎను ఆర్థిక మంత్రి ప్రశంసించారు. పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్) ద్వారా ట్రెజరీ సింగిల్ అకౌంట్స్ (టిఎస్ ఎ), డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డిబిటి) పిహెచ్ ఎఎల్ లను విజయవంతంగా అమలు చేయడం ఒక ఉదాహరణ అని శ్రీమతి సీతారామన్ పేర్కొన్నారు.

ఇంకా వివరిస్తూ, టిఎస్ఎ సిస్టమ్ "జస్ట్ ఇన్ టైమ్" ఫండ్ విడుదల యంత్రాంగాన్ని అభివృద్ధి చేసిందని ,కేంద్ర ప్రభుత్వ 150 స్వయంప్రతిపత్తి సంస్థలలో అమలు జరిగిందని ఆర్థిక మంత్రి చెప్పారు; కాగా, పిఎఫ్ఎంఎస్ పారదర్శకత కోసం , వేగవంతమైన చెల్లింపును సులభతరం చేయడానికి , చివరి లబ్ధిదారునికి ప్రభుత్వం చేరగలిగే సాధనంగా అభివృద్ధి చెందిందని అన్నారు.

సిజిఎ సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించు కోవడం ద్వారా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తోందని, తద్వారా ప్రజా ధనంచౌర్యాన్ని అరికడుతుందని, ప్రయోజనాలు నేరుగా పౌరులకు చేరేలా చూస్తుందని శ్రీమతి సీతారామన్ అన్నారు.

అకౌంట్ వ్యవస్థ సక్రమంగా పని చేసేలా తెరవెనుక కృషి ద్వారాసివిల్ అకౌంట్స్ సంస్థ సాధించిన అనేక నిశ్శబ్ద మైలురాళ్లను ఆర్థిక మంత్రి ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఆర్థిక కార్యదర్శి, వ్యయ కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్ మాట్లాడుతూ, పిఎఫ్ఎంఎస్ ఒకవైపు దేశ ఆర్థిక నిర్వాహకులకు కీలకమైన సహాయం అని, మరోవైపు, చాలా ముఖ్యమైన పౌర కేంద్రిత చొరవ గా కొత్త ఇ-బిల్లు వ్యవస్థ నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త ఇ-బిల్ వ్యవస్థ సమయం వేదాను మరింత తగ్గిస్తుందని, డిజిటల్ ఇండియా , ఈవోడిబి దిశగా అకౌంట్స్ కు నమూనాగా పనిచేస్తుందని డాక్టర్ సోమనాథన్ తెలిపారు.

# అభివృద్ధిలో దేశానికే ఆదర్శం తెలంగాణ : స్పీకర్ పోచారం

నిజామాబాద్, మార్చి 3:తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. అయినా 70 ఏండ్ల ముందు ఏర్పడిన రాష్ట్రాలకు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లాలోని కోటగిరి మండలం యాద్గార్‌పూర్, వల్లభాపూర్ గ్రామాలలో గురువారం రూ. 15 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నిజాంసాగర్ లోకి తీసుకువచ్చామన్నారు.

భవిష్యత్తులో ఆయకట్టుకు ధోకా ఉండదు. ఏటా రెండు పంటలు పుష్కలంగా పండుతాయన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలోని పేదలందరి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తాడు బొంగరం లేని కొన్ని పార్టీల వారు ఏదేదో మాట్లాడుతారు.మీరు 70 ఏండ్లు పాలించి ఏం చేశారన్నారు. మీ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నించారు.



# ఆవుపై చిరుత దాడి : భయాందోళనలో ప్రజలు

హైదరాబాద్, మార్చి 3:ఓ చిరుత ఆవుపై దాడి చేసి చంపేసింది.. దీంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటన ఎక్కడ జరిగిందంటే తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది. చిరుత పులి ఓ ఆవుపై దాడి చేయడం స్థానికంగా కలకలం రేపింది. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో ఆవుపై చిరుతపులి దాడి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు పుట్ట అనంతరెడ్డి తన పశువులను రోజు వారీగా గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద పశువుల కొట్టంలో కట్టివేశాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆవుపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. గురువారం తెల్లవారుజామున రైతు వెళ్లి చూసే సరికి ఆవు మృతి చెంది ఉండడంతో కన్నీటి పర్యాంతమయ్యాడు. సుమారు 70వేల విలువ గల ఆవు మృతి చెందినట్లు రైతు వాపోయాడు. ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా గతంలో కూడా పలుమార్లు చిరుత పశువులపై దాడి చేయడంతో మృతి చెందాయి. చిరుత ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

## 3రోజుల పునశ్చరణ తరగతులకు శ్రీకారం..

న్యూఢిల్లీ, మార్చి 3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, గత ఎనిమిదేళ్లలో పట్టణ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి, భారతీయ ప్రభుత్వ పరిపాలనా సంస్థ (ఐ.ఐ.పి.ఎ.) అధ్యక్షుడు డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు చెప్పారు. భూగోళ విజ్ఞానం, ప్రధానమంత్రి కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా సమస్యలు, పెన్షన్లు, అనుశక్తి, అంతరిక్ష పరిశోధన వ్యవహారాలను కూడా జితేంద్ర సింగ్ పర్యవేక్షిస్తున్నారు. పట్టణ పరిపాలనా ప్రక్రియపై నిర్వహిస్తున్న 3 రోజుల పునశ్చరణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. జమ్ము కాశ్మీర్ పట్టణ స్థానిక పరిపాలనా సంస్థల మేయర్లు/చైర్ పర్సన్లు, మునిసిపల్ కమిషనర్లు/ముఖ్య కార్యనిర్వహణాధికారులకోసం ఈ పునశ్చరణ తరగతులను నిర్వహించారు. ప్రారంభోపన్యాసంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, 25ఏళ్ల దార్శనికతతో కూడిన పట్టణ ప్రణాళిక, పట్టణాభివృద్ధి గురించి తొలిసారిగా ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ ప్రస్తావించిందన్నారు. అప్పటికల్లా దేశంలో 50శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లోనే నివసించే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. 2022-23వ సంవత్సరపు కేంద్ర బడ్జెట్లో పట్టణ రంగానికి ఇదివరకెన్నడూ లేనంత భారీ స్థాయిలో రూ. 76,549.46 కోట్లను కేటాయించినట్టు కేంద్రమంత్రి చెప్పారు. పట్టణ రంగ విధానాలు, ప్రణాళికా రచన, అమలు, సామర్థ్యాల నిర్మాణం, పరిపాలనా ప్రక్రియ వంటి అంశాల్లో సమూలమైన మార్పులకోసం బడ్జెట్లో పలు చర్యలను ప్రతిపాదించారని, ప్రణాళికా కర్తల, ఆర్థికవేత్తల, సంస్థలతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు పలు చర్యలు తీసుకోబోతున్నట్టు ప్రకటించారని చెప్పారు. 2047వ సంవత్సరానికి అంటే, భారతదేశం వందేళ్లు పూర్తి చేసుకునేసరికి దేశంలోని సగం జనాభా పట్టణాల్లోనే ఆవాసం పొందే సూచనలున్నాయని కేంద్రమంత్రి చెప్పారు.

2014వ సంవత్సరంనుంచి కేంద్ర ప్రభుత్వం పలు పట్టణ ప్రత్యేక పథకాలను ప్రారంభించిందని ఆయన అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్.బి.ఎం.), ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఎ.వై.), అటల్ పట్టణ పునరుద్ధరణ, పరివర్తనా పథకం (అమృత్), స్మార్ట్ సిటీల పథకం (ఎస్.సి.ఎం.), జాతీయ పట్టణ జీవనోపాధి పథకం (ఎన్.ఎల్.యు.ఎం.) వంటి కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల్లోని మెజారిటీ జనాభా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా చేపట్టే ఈ పరివర్తనా పథకాలు సమ్మిళితంగా, సుస్థిరంగా, పర్యావరణహితంగా, ఉత్పాదకత సాధించేలా చూసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని జితేంద్ర సింగ్ చెప్పారు.

భారతదేశంలో సగటు స్థాయిని మించి పట్టణీకరణ సాధించిన రాష్ట్రాల్లో తలసరి ఆదాయం బాగా ఎక్కువగా ఉందని, తక్కువ స్థాయిలో పట్టణీకరణ జరిగిన బీహార్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, తదితర రాష్ట్రాలతో పోల్చినపుడు ఈ విషయం అవగతమవవుతోందని కేంద్రమంత్రి అన్నారు. గుజరాత్ నుంచి తమిళనాడు వరకూ కొన్ని రాష్ట్రాలు పట్టణీకరణలో 50శాతం మార్కును (తమిళనాడు) దాటడం గానీ, పట్టణాల్లో మెజారిటీకి చేరువకావడం గానీ జరిగిందన్నారు.

జమ్ము కాశ్మీర్ కు చెందిన మునిసిపల్ పరిపాలనా అధికారులు, అధినేతలకు నిర్వహించే పునశ్చరణ తరగతుల కార్యక్రమాన్ని కేంద్రమంత్రి ప్రస్తావిస్తూ, 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. రానున్న పాతికేళ్లలో పాక్షిక పట్టణీకరణ (25శాతం) స్థాయినుంచి మెజారిటీ పట్టణాలను అభివృద్ధి చేసే స్థాయికి భారతదేశం మార్పు చెందుతున్న తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వస్తూత్పత్తి, సేవల రంగాల విస్తృతి,.. పట్టణీకరణతో అనుసంధానమైన నేపథ్యంలో పట్టణ రంగ మార్పులన్నింటినీ ఆర్థిక ప్రగతికి ప్రతీకలుగా చెప్పవచ్చని ఆయన అన్నారు.

దేశంలోని పలు ప్రాంతాలతో పాటుగా, జమ్ము కాశ్మీర్.లో పట్టణీకరణ కూడా పెనుమార్పు చెందబోతున్నదని, 2011లో 27శాతం మేరకు ఉన్న పట్టణ జనాభా రానున్న దశాబ్దాల్లో సగానికి చేరుకోనున్నదని ఆయన చెప్పారు. మన పట్టణ పథకాల్లో పేర్కొన్నట్టుగా సంస్కరణలన్నింటినీ పటిష్టంగా చేపట్టవలసిన నేపథ్యంలో పట్టణీకరణ పయనం ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే ఆస్కారం ఉందని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రాచీన పురపాలక సంఘాల్లో ఒకటిగా, 1930వ సంవత్సరంలో ఏర్పాటైన జమ్ము మునిసిపాలిటీ పట్టణీకరణ ప్రక్రియకు మార్గం చూపాలని, జమ్ము కాశ్మీర్ ఆర్థికాభివృద్ధికి అదే కీలకమవుతుందని ఆయన అన్నారు. 2000వ సంవత్సరంలో ఏర్పాటైన జమ్ము నగర పాలక సంస్థ గత కొన్నేళ్లుగా ఎన్నో ప్రశంసనీయమైన చర్యలు తీసుకోవడం తనకు సంతోషం కలిగిస్తోందన్నారు. ఆన్ లైన్ ద్వారా చెల్లింపుల వ్యవస్థ, అనుమతుల మంజూరీ ప్రక్రియ, అక్రమ నిర్మాణాల నిర్మూలన, బ్యానర్లు, హోర్డింగుల నియంత్రణ, సమర్థవంతంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి చర్యలను జమ్ము నగర పాలక సంస్థ చేపట్టిందన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలులో ఉన్న అనేక ఆవిష్కరణలను, సృజనాత్మక పద్ధతులను, ఉత్తమ విధానాలను జమ్ము నగరంకోసం సానుకూలంగా వినియోగించుకొనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధుల పాత్రే నిర్ణయాత్మకమని ఆయన అన్నారు.ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నిర్వహించాల్సిన బహుముఖ పాత్రల గురించి కేంద్రమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. పట్టణ పరిపాలనా ప్రక్రియలో అట్టడుగు స్థాయినుంచి అనుసంధానం ఏర్పరచడం, అట్టడుగు స్థాయినుంచి జాతీయ నాయకత్వ స్థాయికి నాయకులు సహజంగా ఎదిగేలా ప్రోత్సహించడం, ప్రజా సంఘాల భాగస్వామ్యం, స్థానిక వనరుల సమీకరణ,.. నగర పాలనా వ్యవస్థకు సమాజానికి అలాగే, రాష్ట్ర నాయకత్వానికి, నగరానికి మధ్య మధ్యంతర అనుసంధానకర్తగా పనిచేయడం వంటి బహుముఖ పాత్రల నిర్వహణను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా ఏర్పాట్లు, గృహనిర్మాణం వంటి రంగాలపై మనం ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఉందని సూచించారు.జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా నీటిసరఫరా సదుపాయం కల్పించడంతోపాటుగా, అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ బహిరంగ మలవిసర్జన రహిత స్థాయిని (ఒ.డి.ఎఫ్. స్థాయిని) ఇప్పటికే మనదేశం సాధించిందని కేంద్రమంత్రి అన్నారు.

## మూడు రాజధానుల బిల్లు మళ్ళీ పెడతాం - మంత్రి బొత్స

అమరావతి, మార్చి 3:సీఆర్డీయే చట్టాన్ని రద్దు చేస్తూ చేసిన చట్టాన్ని ప్రభుత్వం గతంలోనే వెనక్కి తీసుకుందని ..అంటే సీఆర్డీయే చట్టాన్ని అమలు చేస్తామనే అర్థం కదా? కోర్టు చెప్పిన దాంట్లో కొత్త విషయం ఏముందని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానులు అనే విధానానికే ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని.. చట్టాలు చేయటానికే శాసనసభ, పార్లమెంటు ఉన్నాయన్నారు. చట్ట సభలకు చట్టాలు చేసే అధికారం లేదని కోర్టు చెప్పింది అనే విషయాన్ని నేను నమ్మటం లేదని.. చెప్పేవాడికి చేసే వాడు లోకువ అని చురకలు అంటించారు. మూడు నెలల్లో అభివృద్ధి చేసి ఇవ్వాలంటే ఎలా సాధ్యమవుతుంది.. మేమే చట్టాలను వెనక్కి తీసుకున్న తర్వాత ఇంకా తీర్పు ఏంటి,, అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఊహించిన తీర్పేనని.. టీడీపీ కి సమాజ అభివృద్ధి కంటే ఒక సామాజిక వర్గ అభివృద్ధి కావాలన్నారు. అధికార పార్టీ తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడటమే టీడీపీ విధానమని.. మూడు రాజధానుల బిల్లు మళ్ళీ పెడతామని స్పష్టం చేశారు.

## దళిత బంధు పథకంతో ఆర్థికంగా ఎదగాలి లాభదాయక యూనిట్లను ఎంపిక చేసుకోవాలి-అదనపు కలెక్టర్ రాజర్షి షా



సంగారెడ్డి, మార్చి3(నేటి నిజం ప్రతినిధి): దళిత బంధు పథకంలో లబ్దిదారులు సరియైన యూనిట్లను ఎంపిక చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అదనపు కలెక్టర్ రాజార్షి షా లబ్దిదారులకు సూచించారు. జహీరాబాద్ నియోజకవర్గం మొగుడం పల్లి మండలం గొడిగార్ పల్లిలో దళిత బంధు పతకం లో ఎంపిక చేసిన లబ్దిదారులతో యూనిట్ల ఎంపిక పై గురువారం ఆయా శాఖల అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాజర్షి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు ఉన్నత స్థితికి ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ ఆధారిత, రవాణా సంబంధిత, ఉత్పత్తి, రిటైల్ వ్యాపారం, హోల్ సేల్ దుకాణాలు, డైరీ, కోళ్ల ఫామ్ మొదలగు యూనిట్ల ఎంపిక పై లబ్దిదారులకు అందులోని విజయాలు, అపజయాలు తెలుపుతూ వేరువేరుగా లాభసాటి అంశాలపై అవగాహన కల్పించారు. డిమాండ్ ఉన్న లాభసాటి యూనిట్లను ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. లబ్ధిదారులు తమ ఆసక్తి మేరకు యూనిట్ల ను ఎంపిక చేసుకోవచ్చని, ఒక లబ్దిదారుడు 2 లేదా 3 యూనిట్లను సైతం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది లబ్దిదారులు కలిసి పెద్ద యూనిట్ సైతం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించే అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మార్కెట్ స్థితిగతులను, మనకు అందుబాటులో ఉన్న నైపుణ్యాన్ని అనుభవాన్ని పురస్కరించుకుని యూనిట్ ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అనుభవం, నైపుణ్యం ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకోవాలన్నారు. దళిత బంధు యూనిట్ ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లబ్దిదారునికి ఉందని, అధికారులు కేవలం అవగాహన కల్పిస్తారని, సరైన యూనిట్ ఎంపికతో లబ్ధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి , డి పి ఓ సురేష్ మోహన్, ఎంవి ఐ, ఎంపీడీవో, తహసిల్దార్, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో చేరిన ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



అమరావతి, మార్చి 3:ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఈరోజు జనసేన పార్టీలో చేరారు. ఆయన ఆర్టీసీ ఈడీగా పదవీ విరమణ చేశారు. హైదరాబాదులోని జనసేన ప్రధాన కార్యాలయంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో వెంకటేశ్వరరావు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు నాదెండ్ల మనోహర్ పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ? జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆలోచనలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజాపక్షంగా ఉన్నాయని, అందుకే జనసేనలో చేరాలన్న నిర్ణయం తీసుకున్నానని వెంకటేశ్వరరావు వెల్లడించారు. జనసేన కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తానని, పార్టీ విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

## అక్టోబర్ నాటికి ఎస్టీపీలు పూర్తి కావాలి

### మూడు షిఫ్టుల్లో పనులు జరగాలి -జలమండలి ఎండీ దానకిశోర్




హైదరాబాద్, మార్చి 3: గ్రేటర్‌లో వందశాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా రూ. 3,800 కోట్లతో 31 కొత్త ఎస్టీపీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులపై బుధవారం ఖైరతాబాద్ సంస్థ కార్యాలయంలో అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఎండి దానకిశోర్ సమీక్ష నిర్వహించారు. అన్ని ఎస్టీపీల నిర్మాణ పురోగతిని విడివిడిగా సమీక్షించారు. అక్టోబర్ నాటికి ఎస్టీపీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఈ మేరకు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని ఎస్టీపీల వద్ద మూడు షిఫ్టుల్లో పనులు జరిగేలా చూడాలని, రాత్రి వేళల్లో పనులు జరుగుతున్నప్పుడు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీల సీజీఎంలు, జీఎంలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 4 రోజుల్లో వైద్య విద్యార్థులందరూ భారత్‌కు.. విద్యార్థులకు ఎంపీ సత్యవతి హామీ




న్యూఢిల్లీ, మార్చి 3:ఉక్రెయిన్‌లో వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరినీ ఈనెల 8లోగా భారత దేశానికి తీసుకువస్తామని వైఎస్సార్సీపీ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కమిటీ సభ్యురాలు బి.వి.సత్యవతి వెల్లడించారు. గురువారం ఢిల్లీలో జరిగిన కేంద్ర విదేశ వ్యవహారాల శాఖ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతదేశ వైద్య విద్యార్థుల గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం ఆమె ఆంధ్రప్రదేశ్ భవన్‌కు చేరుకుని ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ చేరుకున్న 86 మందిని పరామర్శించారు. వారి క్షేమ సమాచారా తెలుసుకుని ఆందోళన చెందవద్దంటూ ఎంపీ సత్యవతి భరోసానిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆమె ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో భవన్ ఉద్యోగులు విద్యార్థులకు వసతి, భోజన, రవాణా, ఇతర సదుపా యాలు అందించారు. భయానక వాతావం`ణాన్ని కళ్లారా చూసిన విద్యార్థులు విడతల వారీగా సురక్షితంగా స్వస్థలాలకు తరలి వెళ్తున్నారు.

## పది పరీక్షలకు పక్కా ప్లానింగ్.. మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు

హైదరాబాద్, మార్చి 3:కరోనా తగ్గుముఖం పట్టడంతో ఈసారి పది ఫరీక్షలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం అవుతోంది. మే రెండవ వారంలో పరీక్షలు జరగనున్నాయి. గతంలో 11 పేపర్లు ఉండేవి వాటిని ఆరు పేపర్లకు కుదించారు. అందులో భాగంగానే శుక్రవారం నుంచి మోడల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ప్లాన్? చేశారు. పరీక్షల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుంటుంది. అందుకే పదిలో మంచి మార్కులు సాధించేందుకు వందరోజుల యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు. సకాలంలో పోర్షన్ పూర్తి చేయడం.. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేసి పరీక్షలకు సిద్ధం చేయడం? వంటి కార్యక్రమాలు పక్కా ప్లానింగ్‌తో నిర్వహిస్తున్నారు. స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేసి పదికి విద్యార్థులకు సిద్ధం చేస్తున్నారు. బాగా చదివే విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేలా.. ఫర్వాలేదనే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా.. వీక్‌గా ఉన్న విద్యార్థులు కనీసం పాసయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఉదయం 8.45గంటలనుండి 9.30 గంటల వరకు.. సాయంత్రం 4.45 గంటలనుండి 5.30గంటలవరకు స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు స్పెషల్ క్లాసులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్షమంది వరకు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో 45వేల మంది, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో 43వేలమంది, వికారాబాద్ జిల్లాలో 12వేల మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అన్ని సర్కార్ బడుల్లో స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేసి విద్యార్థులను సమాయత్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నారు. పది పరీక్షలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. రంగారెడ్డి జిల్లాలో సగం రూరల్, మిగతా సగం అర్బన్ ప్రాంతాలున్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మొత్తం అర్బన్ ప్రాంతాలుండగా వికారాబాద్ జిల్లాలో మాత్రం రూరల్ ప్రాంతాలున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేర ఉత్తీర్ణత శాతం తక్కువే. ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

### శుక్రవారం నుంచి మోడల్ పరీక్షలు..

మే రెండో వారంలో పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అప్పటివరకు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా ఈనెల 4వ తేదీనుండి 11వ తేదీవరకు మొదటి విడత మోడల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 21వ తేదీనుండి 26వ తేదీవరకు సెంకడ్ విడత మోడల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయనే దానిపై మానిటరింగ్ కమిటీకి శ్రీకారం చుట్టారు. శుక్రవారం నుండి ప్రారంభం కానున్న మోడల్ పరీక్షలను మానిటరింగ్ కమిటీ పరిశీలించనుంది. ఈ మేంకు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో గురువారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. మోడల్ పరీక్షలతోపాటు స్పెషల్ క్లాసులు కూడా మానిటరింగ్ కమిటీ పరిశీలించనుంది. మానిటరింగ్ కమిటీలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

### వీక్ ఉన్న సబ్జెక్టులపై ఫోకస్..

గతంలో ఎక్కువమంది విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారనే దానిపై దృష్టిని కేంద్రీకరించారు. ప్రస్తుత పరీక్షల్లో ఆ పరిస్థితులు రాకుండా విద్యార్థులు వీక్‌గా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ముఖ్యంగా గణితం, సామాన్యశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే స్కూళ్ల వారీగా విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వీక్‌గా ఉన్నారనే విషయమై ఉపాధ్యాయులు ఒక అవగాహనకు వచ్చారు. వీక్‌గా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. గతంలో ఎక్కువమంది ఏఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారనే లెక్కలు తీశారు. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా స్పెషల్ ఫోకస్ పెట్టారు. గతంలో 11 పేపర్లు ఉండేవి. వాటిని రద్దు చేసి ప్రస్తుతం ఆరు సబ్జెక్టులకు మాత్రమే పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి కూడా విద్యార్థులను సమాయత్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రంగారెడ్డి జిల్లా వాసురాలు కావడంతో ఈ జిల్లాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు

## దేశం విషయంలో అందరూ ఒక్కటి కావాలి -ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 3:మనల్ని మనం తక్కువ చేసిన ధోరణిని పక్కన పెట్టి, దేశం కోసం అందరూ ఒక్కటై గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉద్బోధించారు. పాశ్చాత్య దేశాల వారు, పాశ్చాత్య భావజాలంలో కూరుకు పోయిన కొంత మంది భారతదేశ ఎదుగుదలను చూసి తట్టుకోలేకపోతున్నారని, అందుకే పెద్ద ఎత్తున దేశ వ్యతిరేక ప్రచారానికి పూనుకుంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితి ఆందోళనకరమని, దేశ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అమెరికా యాత్రికుడు శ్రీ విల్ దురంత్ రాసిన 'ద కేస్ ఫర్ ఇండియా' పుస్తకం తెలుగు అనువాదం 'భారతదేశం పక్షాన' పుస్తకాన్ని బుధవారం విజయవాడలో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి, అహింసలు భారతీయుల రక్తంలోనే ఉన్నాయని, మనపై జరిగిన దండయాత్రను ప్రతిఘటించడమే తప్ప మన బలప్రదర్శన కోసం ఇతరులను కవ్వించే వ్యక్తిత్వం భారతీయులది కాదన్నారు. 'ప్రపంచానికి నాగరికత నేర్పిన వేదభూమి మన భారతదేశం. వసుధైవ కుటుంబ భావనతో ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా భావించి, అందరితో శాంతి, సోదర భావం కోరుకున్న దేశం మనది' అని ఉపరాష్ట్రపతి అన్నారు.

భారతదేశం నేటి వరకు ఏనాడూ విస్తరణ కాంక్షతో, సరిహద్దులను పెంచుకోవాలనే లక్ష్యంతో విదేశాలపై దండయాత్రలు చేసిన సందర్భం ఒక్కటి కూడా లేదన్న ఉపరాష్ట్రపతి, చరిత్రను తిరగేస్తే భారతదేశాన్ని దోచుకునేందుకే విదేశీ దండయాత్రలు జరిగిన విషయం స్పష్టంగా గమనించవచ్చన్నారు. విస్తరణ కాంక్ష లేనందునే భారతదేశం మొదట్నుంచి విశ్వశాంతి కోసం ప్రయత్నిస్తోందన్నారు. బయటి దేశాల్లో రంగు మొదలుకుని అనేక వివక్షలు కొనసాగుతుంటే, భారతదేశం మాత్రం ప్రజాస్వామ్య మార్గంలో శాంతియుతంగా ముందుకు సాగుతోందని తెలిపారు. భాష పేరుతో, ప్రాంతం పేరుతో వివిధ రకాలుగా ప్రజల్ని చీల్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ప్రజలు వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఎంతో మంది విదేశీ యాత్రికుల భారతదేశం గురించి తెలుసుకునేందుకు ఇక్కడకు వచ్చారని, ఇందులో అమెరికాకు చెందిన శ్రీ విల్ దురంత్ కూడా ఒకరని ఉపరాష్ట్రపతి అన్నారు. 'దేశంలోని నలు దిక్కులా పది, పన్నెండు నగరాలను సందర్శించిన ఆయన, గతంలో తాను విన్నవిధంగా భారతీయ సంపద, సంస్కృతీ సంప్రదాయాల ఘనత ఎక్కడా కనిపించక ఆశ్చర్యపోయిన విషయాన్ని ఈ మనకు పుస్తకం తెలియజేస్తుంది' అని అన్నారు.

ఆంగ్లేయులు స్వేచ్ఛా ప్రియులని, మర్యాదస్తులని అప్పటి దాకా నమ్మిన శ్రీ విల్ దురంత్ భారతీయుల పట్ల ఆంగ్లేయులు వ్యవహరిస్తున్న తీరును చూసి విస్మయం చెందారన్నారు. తన పరిశోధనను పక్కన పెట్టి, ఒక మానవతావాదిగా నిర్భయంగా, నిజాయితీగా తను చూసిన భారతదేశ స్థితిగతులను వివరిస్తూ 1930లో ఈ పుస్తకాన్ని ప్రచురించిన విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ పుస్తకం చదివిన వారికి ఆశ్చర్యంతోపాటు బ్రిటీష్ వారు మన దేశాన్ని ఉద్ధరించారనుకుని భావిస్తున్న వారి బూజు పట్టిన అభిప్రాయాలు పటాపంచలు అవుతాయన్నారు.

న్యాయం చెయ్యమని ఎవరిని అడగాలో తెలియని స్థితిలో, అడగాలన్న స్పృహ కూడా లేని పరిస్థితులలో ఉన్న భారతీయులను చూసి రచయిత శ్రీ విల్ దురంత్ గారు నిశ్చేష్టులయ్యారంటేనే నాటి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రతి భారతీయుడూ మరీ ముఖ్యంగా యువత ఈ పుస్తకాన్ని చదివి నిజాలను తెలుసుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. భారతదేశ ఘనమైన చరిత్రను పాశ్చాత్యులు సృష్టించిన అసత్యాలు, అర్ధసత్యాలు దృష్టికోణంలో కాకుండా, నిజమైన భారతీయ దృష్టికోణంలో తిరిగి లిఖించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత చక్కటి పుస్తకాన్ని అనువదించిన రచయిత్రి శ్రీమతి నాదెళ్ల అనురాధ గారిని, ప్రచురణకకర్త శ్రీ అశోక్ గారిని ఉపరాష్ట్రపతి అభినందించారు.

మన భాషను, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి, మాతృభాషలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు. ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలో సాగాలని, పరిపాలన, కోర్టు వ్యవహారాలు సైతం ఆయా భాషల్లో సాగించేందుకు చొరవ మరింత పెరగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంఘం పూర్వ అధ్యక్షులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, సిద్ధార్థ అకాడమి అధ్యక్షులు డా. చదలవాడ నాగేశ్వరరావు, స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యదర్శి శ్రీ చుక్కపల్లి ప్రసాద్, అలకనంద ప్రచురణకర్త శ్రీ డి. అశోక్ కుమార్, రచయిత్రి శ్రీమతి నాదెళ్ళ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మందుల కొరత లేదు.. హెల్త్ ప్రొఫైల్‌పై మంత్రి హరీష్ కీలక ప్రకటన



హైదరాబాద్, మార్చి 3:తెలంగాణలో మందుల కొరత లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. నిర్మల్ జిల్లాలో రూ. 40 కోట్లతో నిర్మించే నూతన జిల్లా అసుపత్రి భవనానికి మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ?280 పడకల ఆసుపత్రి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల కోరిక మేరకు సీఎం ఇక్కడ మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. మెడికల్ కాలేజీకి ఏర్పాటుకు మొదటి మెట్టు ఈ ఆసుపత్రి ప్రారంభం అని పేర్కొన్నారు. ఏఎన్ఎం, ఆశాలు కరోనా సమయంలో ఎంతో కష్టపడ్డారని కొనియాడారు. రాష్ట్ర హైకోర్టు సైతం కరోనా మూడో వేవ్ లో తెలంగాణ పనితీరును మెచ్చుకుందని గుర్తు చేశారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆశల జీతాలు తక్కువగా ఉండేవన్న మంత్రి హరీష్.. పెంచాలని రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేసేవారి గుర్తు చేశారు. నాటి ప్రభుత్వాలు గుర్రాలతో తొక్కించాయని మండిపడ్డారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత జీతాలు పెంచారన్నారు. 2014 ముందు రు. 1500 ఉంటే.. 6000 వేలకు పెంచారు. అడగకుండానే మళ్ళీ 30 శాతం పెంచి ఇప్పుడు రు. 9750 ఇస్తున్నామన్నారు. మరింత బాగా పని చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని 27 వేల మందికి స్మార్ట్ ఫోన్ కూడా ఇచ్చామన్నారు. ఒకపుడు ఆశాలు అంటే చిన్నచూపు.. ఇప్పుడు గౌరవం పెరిగిందన్నారు. డెలివరీ విషయంలో ఆశాలు మరింత దృష్టి సారించాలన్నారు. గర్భం దాల్చిన తర్వాత రెగ్యులర్ గా చెకప్స్ చేయించాలని సూచించారు. ఎనీమియా బారి నుండి గర్భిణులను కాపాడాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలని, సాధారణ డెలివరీలు ఎక్కువ జరిగేలా చూడాలని మంత్రి హరీష్ చెప్పారు. ఆశాలు ఈ విషయంలో కృషి చేయాలన్నారు. పుట్టిన బిడ్డకి అప్పుడే గోల్డెన్ అవర్ లో తల్లి పాలు అందుతాయని పేర్కొన్నారు.

తెలంగాణలో బిపి, షుగర్ కేసులు పెరుగుతున్నాయన్న మంత్రి హరీష్.. ప్రాథమికంగా గుర్తించి మందులు ఇచ్చినా కొందరు అవగాహన లేక వేసుకోవడం లేదన్నారు. ఇలాంటి వారి కోసం హెల్త్ ప్రొఫైల్ ప్రారంభించుకోబోతున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఈనెల 5న ములుగు, సిరిసిల్లలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అంగన్ వాడీలను కూడా ప్రభుత్వం బాగా చూసుకుంటున్నది. 2014 లో 4200 ఉన్న జీతాన్ని పెంచింది. ఇప్పుడు 13,650 అందుకుంటున్నారు. దేశం లోనే మనది అత్యధికం. తెలంగాణలో మందుల కొరత ఉండదు. కొరత ఉందంటే డాక్టర్ పై చర్యలు ఉంటాయి. మెడికల్ బడ్జెట్ పెంచాము. పేదలకు వైద్యం భారం కాకుండా.. చూస్తున్నది. 60 ఏళ్ల సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో ఉన్నవి 3 మెడికల్ కాలేజీలు మాత్రమే. మాత్రమే. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఏళ్లలో 17 మెడికల్ కాలేజీలకు పెంచుకున్నము. ఆశాలు అంగన్ వాడీలు ఎ ఎన్ ఏం లు మీరు ఎంతో ముఖ్యం.. 80 శాతం సాధారణ డెలివరీలు అయ్యేలా కృషి చేద్దాం. ఆరోగ్య రంగంలో మనం మొదటి స్థానానికి వెళ్ళాలి. ఏ ఇబ్బంది ఉన్నా చూసుకుంటా.. ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం చేసేలా కృషి చేస్తా.. మీరు ప్రజలకు నాణ్యమైన సేవలు చేయండి. ఒకప్పుడు నేనురాను బిడ్డో సర్కారు దావాఖాన అనే మాట ఉండే.. ఇప్పుడు నేను సర్కారు దవాఖానకే పోతా అనేలా అభివృద్ధి చేసాము. రాబోయే రోజుల్లో ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్ కాబోతుందని మంత్రి హరీష్ రావు చెప్పారు.

## కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి, మార్చి 3(నేటి నిజం ప్రతినిధి): కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ వీరారెడ్డి పేర్కొన్నారు. మన ఊరు మన బడి, మన బస్తీ–మన బడి, ఈ కార్యక్రమంలో మొదటి విడతలో ఎంపిక చేసిన పుల్కాల్ మండలం సింగూర్ , ఆందోల్ మండలం అక్సాన్ పల్లి, వట్ పల్లి మండలం ఖాధిరబాద్ గ్రామాలలో శిజూప్రఃబ, ఎజూప్రఃబ పాఠశాలను గురువారం నాడు అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎం ఈ ఓ లు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సెక్రటరీలు, జడ్పీటీసీ లతో సామీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దుకునే అద్భుతమైన కార్యక్రమం మన ఊరు– మన బడి అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించనున్నందున జూన్ లోగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో కల్పించే వసతుల పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

మన ఊరు మన బడి కార్యక్రమ అమలుకు ఇంజనీరింగ్ ఏజెన్సీని కేటాయించడం జరిగిందని, మండలంలో ఎంపిక చేసిన పాఠశాలలను సదరు ఇంజనీర్లు పరిశీలించి, 12 అంశాల్లో చేపట్టవలసిన పనుల జాబితా వాటి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. దాతల నుంచి పాఠశాల అభివృద్ధి కొరకు నిధులు సేకరించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్, పెయింట్లు, గ్రీన్ బోర్డ్ మొదలైన సామాగ్రి రాష్ట్ర స్థాయిలో కొనుగోలు చేయబడతాయని తెలిపారు. శిధిలావస్థలో ఉన్న గదిలో స్థానంలోనే అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని, నీరు కురిసే సమస్యలు ఉన్న పాఠశాలల్లో, వాటర్ ప్రూఫ్ రూఫింగ్ వంటి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలకు విద్యుత్ సౌకర్యం, స్విచ్ బోర్డు ఏర్పాటు, అన్ని తరగతి గదులకు సీలింగ్ ఫ్యాన్, ఎల్ఈడీ ట్యూబ్ లైట్స్ ఉండే విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.ప్రహరీ గోడ, నీటి వసతి తో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్డు మొదలైన పనులు ఉపాధిహామీ నిధులతో చేపట్టే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

## ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడిన గీత కార్మికునికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 15 వేలు మంజూరు



రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లావేములవాడ మండలం సంకేపల్లి కు చెందిన గీత వృత్తి దారుడు బుర్ర శంకరయ్య గౌడ్ తాటి చెట్టు మిదికెళ్ళిప్రమాదవశాత్తు పడిన వెంటనే సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామి గౌడ్ కు సమాచారం అందించగా ఆయన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన బీసీ కార్పొరేషన్ చీఫ్ సెక్రెటరీతాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర.వెంకటేశం,కార్పొరేషన్ ఎం.డి. ఉదయ్ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ పాముకుంట్ల.రవీందర్ హాస్పటల్ ఖర్చుల నిమిత్తం 15000 వేలు చెక్కును జిల్లా బీసీ మంజూరు చేసి పంపించగా గురువారం జిల్లా బీసీ అధికారులు, సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తీగల. శ్రావణ్ గౌడ్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రాము గౌడ్ బోయినపల్లి మండల అధ్యక్షులు బాలగోని ప్రశాంత్ గౌడ్ . అధికారులతో కలిసి పరామర్శించిన అనంతరం బాధితుడు బుర్ర శంకరయ్య గౌడ్ కు చెక్కును అంద జేశారు.ఈ సందర్భముగా బుర్ర.వెంకటేశం కు,పాముకుంట్ల.రవీందర్ కి సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము నాయకులకు బాధితుడు బుర్ర శంకరయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలియ జేశారు


పద్మశ్రీ డా. ఆశావాది ప్రకాశరావు గారి స్మారకార్థం



రాయలసీమ పద్యపోటీలు - 2022

రూ. 10,000/- బహుమతులు

చివరి తేది : మార్చి 25




అంశం : రాయలసీమ నేపథ్యంగా ఏదేని అంశం.

"క్షామము దాపురించి పలుమారులు చచ్చెను జంతుసంతతుల్
వేమరు జచ్చినారు ప్రజ వేనకువేలు చరిత్రలోపలన్
క్షామములెన్ని వచ్చిన రసజ్ఞత మాత్రము చావలేదు జ్ఞా
నామృత వృష్టికిన్ కొరతనందని రాయలసీమ లోపలన్"
– నండూరి రామకృష్ణమాచార్యులు

గత కొన్నేళ్లుగా రాయలసీమ మహాకవి సమ్మేళనాలు కొనసాగిస్తూ వస్తున్నాం. ప్రత్యేకంగా రాయలసీమ పాటల పోటీలు (2020), కథల పోటీలను (2021) నిర్వహించి ఇరవై వేల రూపాయల బహుమతులను అందించాం. ఒక్కో సంవత్సరం ఒక్కో ప్రక్రియలో పోటీల నిర్వహణలో భాగంగా ఈసారి పద్యప్రక్రియలో పోటీలు నిర్వహిస్తున్నాం.

అవధానవిద్యకు, పద్యకవిత్వానికీ తన జీవితాంతం కృషిచేసిన పద్మశ్రీ డా. ఆశావాది ప్రకాశరావు గారి స్మారకార్థం ఈ పోటీలు కొనసాగించి, ఉగాది పర్వదినం సందర్భంగా పదివేల రూపాయల బహుమతులను కవులకు అందజేస్తాం.

రాయలసీమ పద్యకవిత్వానికి పట్టుగొమ్మ. తెలుగుపద్య సాహిత్యచరిత్రలో రాయలసీమవాసుల ప్రాతినిధ్యం వెలకట్టలేనిది. సమాకాలీన సమాజాన్ని సైతం ఎంతో మంది కవులు అద్భుతంగా పద్యాల ద్వారా చిత్రిస్తున్నారు. రాయలసీమ జన జీవితం, సమకాలీన స్థితిగతులు, సంస్కృతి, భవితవ్యం తదితర వైవిధ్య అంశాలను పద్యం ద్వారా సీమ సమాజంలోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని నిర్ణయించాం. ఈ రాయలసీమ సాంస్కృతిక వికాసోద్యమాన్ని విజయవంతం చేయాలని కవులందరినీ ఆహ్వానిస్తున్నాం.

సూచనలు:
రాయలసీమ నేపథ్యంగా వస్తువు ఉండాలి. ఆకట్టుకునే శైలిలో పద్యం నడపాలి. కేవలం ఐదు పద్యాలు (సీసపద్యాలు రెండింటికి మించరాదు) మాత్రమే రాయాలి. పాండిత్య ప్రదర్శనగా కాకుండా పద్యం ప్రజలకు చేరువ అయ్యేలా సరళంగా ఉండాలి. అన్నిప్రాంతాలవారు పాల్గొనవచ్చు.

గమనిక:
పోటీలతో నిమిత్తం లేకుండా విడిగా కూడా పై సూచనలు అనుసరించి పద్యాలు రాసి పంపవచ్చు. పద్య సంకలనంలో వాటిని స్వీకరిస్తాం.

పద్యాలు పంపవలసిన వాట్సాప్ నెంబర్ :
9962544299
చివరి తేది : 25 మార్చి 2022

సమన్వయకర్త : డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి
డా. పి. దామోదరరెడ్డి, యం. రవికుమార్, పి. రాజశేఖర్‌రెడ్డి,
డా. యస్. వాసంతి, జె. నిర్మల, ఏ. సునీత, వై. శైలజ, యం. లలితకుమారి

నిర్వహణ :
వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం (రి), రాయలసీమ సాంస్కృతిక వేదిక,
అనంతపురము. వివరాలకు : 9963917187, 9444402770

# దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య తగ్గింది : లవ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మార్చి 3: దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య తగ్గిందని కేంద్రం గురువారం తెలిపింది. కొవిడ్ కేసుల వారం సగటు 11వేలు మాత్రమే ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రాష్ట్రంలోనే 10వేలకుపైగా యాక్టివ్ కేసులున్నాయని.. రెండు రాష్ట్రాల్లోనే 5-10వేలకుపైగా యాక్టివ్ కేసులున్నాయని, మొత్తం యాక్టివ్ కేసుల్లో 50శాతం కేరళ, మహారాష్ట్ర, మిజోరాంలోనే ఉన్నాయన్నారు.

ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లో కొవిడ్ కేసులు ఇంకా భారీగానే నమోదవుతున్నాయని, ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రోజుకు 15లక్షల కేసులు రికార్డవుతున్నాయని చెప్పారు. ప్రపంచంతో పోలిస్తే భారత్‌లో కేవలం 0.7శాతం మాత్రమే రోజువారీ కేసులు నమోదువుతున్నాయన్నారు. మరణాల నివారణలో వ్యాక్సినేషన్ ప్రభావం ఎంతో ఉందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ అన్నారు. వందలాది మందిని రక్షించడంలో వ్యాక్సిన్లు విస్తృతమైన వ్యాక్సినేషన్ చాలా ముఖ్యమైన పాత్ర పోషించాయని స్పష్టమవుతోందని నీతి ఆయోగ్ మెంబర్ (హెల్త్) డాక్టర్ వీకే పాల్‌పేర్కొన్నారు.

# రోమన్ అబ్రమోవిచ్ సంచలన నిర్ణయం.. ఉక్రెయిన్ కోసం 'చెల్సియా' అమ్మకం

మాస్కో, మార్చి 3:: చెల్సియా ఫుట్‌బాల్ క్లబ్ రష్యన్ యజమాని రోమన్ అబ్రమోవిచ్ ప్రపంచాన్ని నివ్వెరపరిచే నిర్ణయం తీసుకున్నాడు. ఉక్రెయిన్ బాధితుల కోసం తన ప్రీమియర్ క్లబ్‌ను అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉక్రెయిన్ యుద్ధ బాధితులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు.

2003లో చెల్సియా క్లబ్‌ను కొనుగోలు చేసిన ఈ బిలియనీర్.. ఉత్తమ ప్రయోజనం కోసం ఈ క్లబ్‌ను విక్రయించాలని భావిస్తున్నట్టు చెప్పాడు. క్లబ్ నియంత్రణను ట్రస్టీలకు అప్పగిస్తున్నట్టు ప్రకటించిన కొన్ని రోజులకే అబ్రమోవిచ్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. తానెప్పుడూ క్లబ్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయాలు తీసుకుంటానని పేర్కొన్నాడు.

ప్రస్తుత పరిస్థితిలో క్లబ్, అభిమానులు, ఉద్యోగులు, క్లబ్ స్పాన్సర్లు, భాగస్వాములకు ఇది మేలు చేస్తుందన్న నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు రోమన్ చెప్పాడు. అబ్రమోవిచ్ కాలంలో చెల్సియా క్లబ్ 19 మేజర్ టోర్నీలను గెలుచుకుంది. ఇందులో తొలి రెండు చాంపియన్ లీగులతోపాటు ఐదు ప్రీమియర్ లీగ్ టైటిళ్లు కూడా ఉన్నాయి. అయితే, రష్యా ఇప్పుడు పొరుగు దేశమైన ఉక్రెయిన్‌పై దాడికి తెగబడడంతో 55 ఏళ్ల రోమన్ ఈ క్లబ్‌తో బంధాన్ని తెంచుకోవాలని నిర్ణయించుకున్నాడు.

# అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ పిజీ కళాశాలలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్, ప్రొఫెసర్ లింబాద్రి




రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ మ పీజీ కళాశాలని గురువారంనాడు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సందర్శించారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, డిజిటల్ గ్రంథాలయం, డిజిటల్ తరగతి గదులు, నాణ్యమైన విద్యా బోధన తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలోని సౌకర్యాలకు అనుగుణంగా విద్యార్థుల సంఖ్యని మరింతగా పెంచాలని సూచించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను అభినందిస్తూ ఫలితాలను మరింత మెరుగ్గా సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ యొక్క పనితీరుని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి గారిని, ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్. రవీందర్, శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ మల్లేషం, జేఎన్టీయూహెచ్ హైదరాబాద్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ నరసింహారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉమర్ జలీల్, కళాశాల కళాశాల విద్య ఆర్జెడి డాక్టర్ యాదగిరి, ఇతర అధికారులను కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఎన్ టీయూ హెచ్ రాజన్న సిరిసిల్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్, కళాశాల అధ్యాపకులు మరియు డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అఫ్సారీ ఉస్మానీ, డాక్టర్ రమాదేవి, డాక్టర్ మధు రాజేష్, కే రాజేష్, శ్రీ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రభాకర్ నీలం శ్రీనివాసులు, కళాశాల యా అంజాద్ అలీ, నారాయణ, నరసయ్య, మధుబాబు, దీపిక, తదితరులు పాల్గొన్నారు

# మహమ్మారి సమయంలో ఎస్ఎంఈలు వృద్ధి చెందేందుకు తోడ్పాటునందించిన ఐదు కంపెనీలు

హైదరాబాద్, మార్చి 3:అభివృద్ధి చెందుతున్న భారతీయ ఎస్ఎంఈ రంగంపై కోవిడ్?19 మహమ్మారి విరుచుకుపడింది. సరఫరా చైన్ అంతరాయాలు, అమ్మకాలలో క్షీణత కారణంగా ఎస్ఎంఈలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారతదేశపు 6.3 కోట్ల ఎంఎస్ఎంఈలు భారతీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచినప్పటికీ లాక్‌డౌన్స్, నైట్ కర్ఫ్యూల కారణంగా అమ్మకాల పరంగా 2021లో 11% క్షీణత నుంచి మాత్రం తప్పించుకోలేకపోయారు. అంతకు ముందు అది మరింత దిగజారి 46% క్షీణత కనిపించింది.అయితే ఈ సమయమే ఎస్ఎంఈలు పూర్తిగా డిజిటల్‌గా రూపాంతరం చెందేందుకు అవకాశామూ కల్పించింది. ఆర్థిక సంస్థల తోడ్పాటుతో ఎస్ఎంఈలు తమ వ్యాపారాలను ఆన్‌లైన్‌కు తీసుకువెళ్లగలిగారు. ఈ ఆర్థిక సంస్థలే ఈ ఎస్ఎంఈలకు అవసరమైన పూర్తి మద్దతును అందించడంతో పాటుగా ఉద్యోగుల ఆర్థిక సంక్షేమం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడంలో సహాయపడ్డాయి.ఈ స్టార్టప్స్ ప్రయత్నాల కారణంగా చిరు వ్యాపార సంస్థలు ఆన్‌లైన్‌లో ఋణాలను పొందడం, ఆన్‌లైన్‌లో ఆర్డర్లను తీసుకోవడం, క్యుఆర్ కోడ్స్‌ను ఏర్పాటుచేసుకోవడం సాధ్యమైంది. ఈ దిగువన ఎస్ఎంఈలకు మద్దతునందించిన 5 స్టార్టప్స్ గురించి వెల్లడించాము. ఇవి మహమ్మారి సమయంలో కేవలం ఎస్ఎంఈలు మనుగడ సాధించడంలోమాత్రమే కాదు అవి అసాధారణ వృద్ధి సాధించడంలో సైతం తోడ్పడ్డాయి.

1. ప్రోటీయం- ఎంఎస్ఎంఈ వ్యాపార ఋణాలుఎస్ఎంఈలకు సంప్రదాయ బ్యాంకుల నుంచి ఋణాలు పొందడం పెను సవాలు. ప్రోటీయం పూర్తి స్థాయిలో ఋణాలను అందించే సంస్థ. ఋణాలను పొందాలనుకుంటున్న వ్యక్తి ఉంటున్న ప్రాంతం, భాష తదితర కారణాల వల్ల ఋణం తిరస్కరించబడకూడదని నమ్ముతుంది. ఈ సంస్థ ఒక లక్ష నుంచి 5 కోట్ల రూపాయల వరకూ ఋణాలను ఎస్ఎంఈలకు అందించింది. అలాగే ప్రోటియం సాక్షరతో పాఠశాలలకూ తోడ్పాటునందించింది.

2. వాల్యు డాట్ ఏఐ ఎస్ఎంఈల కోసం పనిచేస్తున్న బ్లూ కాలర్ ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. వీరికి అవసరమైన మద్దతును వాల్యూ డాట్ ఏఐ అందించింది.

3. డిజిచల్- ఎస్ఎంఈలు డిజిటల్‌గా వెళ్లేందుకు సహాయపడింది..లాక్‌డౌన్స్ మరియు భద్రత పట్ల ఆందోళనలు కారణంగా ఎంతోమంది ఆన్‌లైన్ వైపు దృష్టి మళ్లించేలా చేసింది. డిజిచల్ ఈ విషయంలో చిరు వ్యాపారులు డిజిటల్‌గా మారేందుకు తోడ్పడింది. స్టోర్‌యజమానులు, చిరు వ్యాపారుల కు సేవలనందిస్తున్న యాప్ ఇది.

4. లోడ్ షేర్ నెట్‌వర్క్స్ -ఎస్ఎంఈల కోసం లాజిస్టిక్స్ నిర్మాణంఎన్నో ఎస్ఎంఈలు ఈ?కామర్స్ మార్గంలో తమ వ్యాపారాలను నిర్వహించాయి. లోడ్ షేర్ నెట్‌వర్క్స్ ఈ ఎస్ఎంఈల లాజిస్టిక్ సవాళ్లను అధిగమించేందుకు తోడ్పడ్డాయి.

5.పేయు ఎస్ఎంఈలకు మద్దతునందించేందుకు, ఖర్చులను తగ్గించేందుకు పేయు పలు కార్యక్రమాలను ప్రారంభించింది. భారతదేశంలో పే యు 4.5 లక్షల వ్యాపారులకు 100కు పైగా చెల్లింపు విధానాలతో మద్దతునందిస్తుంది.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలకు టీఆర్ఎస్ పార్టీ పిలుపు

హైదరాబాద్, మార్చి 3:తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, సంరక్షణ పథకాలు అద్భుతంగా అమలవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలకు టీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో మహిళా బంధు కేసీఆర్ పేరిట సంబరాలు నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 10 లక్షల మంది పేదింటి ఆడబిడ్డలకు పెళ్లి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇలా చేయడం దేశంలోనే తొలిసారి అని పేర్కొన్నారు. సుమారు 11 లక్షల మంది మహిళలకు కేసీఆర్ కిట్ పథకం అమలైందన్నారు. ఇంతటి ఘనమైన మహిళా సంక్షేమ మైలురాళ్లను చేరుకున్న నేపథ్యంలో, ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని టీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది.

### 6న కేసీఆర్‌కు రాఖీలు కట్టడం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన పార్టీ మహిళా నాయకులు కేసీఆర్‌కు రాఖీలు కట్టాలని కేటీఆర్ సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, డాక్టర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లతో పాటు ప్రతిభ కలిగిన విద్యార్థినిలు, తదితర మహిళలకు గౌరవపూర్వక సన్మానం నిర్వహించాలన్నారు. కేసీఆర్ కిట్, షాదీ ముబారక్, థాంక్యూ కేసీఆర్ ఆకారం వచ్చేలా మానవహారాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ సూచించారు.

### 7న లబ్ధిదారులతో సెల్ఫీలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారుల నివాసాలకు టీఆర్ఎస్ నాయకులు నేరుగా వెళ్లి కలవాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించి, సెల్ఫీలు తీసుకోవాలని సూచించారు.

### 8న మహిళలతో సమావేశాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున(మార్చి 8) నియోజకవర్గ స్థాయిలో మహిళలతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సంబరాలు నిర్వహించాలని కేటీఆర్ చెప్పారు.

### టీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు

గతంలో పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రైతుబంధు వారోత్సవాలతో పాటు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన టీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా తన రాజకీయ అనుభవంలో ఎదురైన క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారం ఇస్తున్న గొప్ప పాలకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలకు అద్భుతమైన పరిష్కారం చూపిస్తూ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను రూపకల్పన చేశారని కొనియాడారు. అందులో భాగంగానే మహిళా సంక్షేమానికి సంబంధించి అపూర్వమైన కార్యక్రమాలను మన ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆడబిడ్డలకు నీటి కష్టాలను దూరం చేసేందుకు మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసి, విజయవంతం చేశారు. మాతా శిశు సంరక్షణ కోసం కేసీఆర్ కిట్ పథకం అమలు చేశామన్నారు. ఈ పథకం అమలుతో మాతా శిశు మరణాలు తగ్గాయి.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు పెరిగాయని కేటీఆర్ గుర్తు చేశారు. కళ్యాణలక్ష్మి కార్యక్రమం ఒక గొప్ప మైలురాయిని చేరుకుంది. ఇప్పటిదాకా సుమారు 10 లక్షల 30 వేల మంది లబ్ధిదారులకు రూ. 9,022 కోట్లను పెళ్లి కానుకగా అందజేశామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు ఇస్తున్నది. వడ్డీ లేని రుణాలను స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నదని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా షీటీమ్స్, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు.

### విద్యాశాఖలోనూ అద్భుతమైన కార్యక్రమాలు

విద్యాశాఖలోనూ అద్భుతమైన కార్యక్రమాలను చేపట్టినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, బాలికలకు ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని తెలిపారు. 70 లక్షల హెల్త్, హైజిన్ కిట్లను విద్యార్థినులకు అందించామన్నారు. ఇతరులు బేటీ బచావో బేటీ పడావో అంటూ కేవలం నినాదాలు ఇస్తున్న సమయంలో నిజంగా విద్యార్థులను చదివించి, సంరక్షిస్తున్న ప్రభుత్వం మనదే అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోనూ మహిళల కోసం అనేక కార్యక్రమాలను చేపట్టామని కేటీఆర్ తెలిపారు.

# శివాజీ యుద్ధ నైపుణ్యం, పరిపాలన రాష్ట్రానికి ఆదర్శం : మంత్రి హరీశ్‌రావు



నిర్మల్, మార్చి 3:: ఛత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధ నైపుణ్యం, పరిపాలన తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. బాసరలో జంక్షన్‌లో శివాజీ విగ్రహాన్ని మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు.

బాసర జంక్షన్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పరిపాలన, యుద్ధ నైపుణ్యంలో అన్నింటా శివాజీ ఆదర్శమని కొనియాడారు. మత సామర్యాన్ని చాటారు. ప్రజలే ప్రభువులుగా ఆయన పాలన సాగిందన్నారు. శివాజీ ఎన్నో యుద్ధాలు చేసినా హింసను ప్రోత్సహించలేదు.. పవిత్ర స్థలాలు ధ్వంసం చేయలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడంలో శివాజీని స్ఫూర్తిగా తీసుకున్నారని పేర్కొన్నారు. అహింసా మార్గంలో 14 ఏండ్లు కేసీఆర్ పోరాటం చేసి.. తెలంగాణ సాధించి.. అద్భుత పాలన అందిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. అభివృద్ధిలో తెలం గాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలు ఇక్కడి పథకాలు అమలు చేయాలని అక్కడి ప్రభుత్వాన్ని అడుగుతున్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు.శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, వేణు గోపాలచారి, ఇతర ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

# బంకా బయోలు నికర లాభంలో వృద్ధి

హైదరాబాద్, మార్చి 3: దేశంలోని అగ్రగామి సుస్థిర పారిశుధ్య పరిష్కారాల సంస్థ బంకా బయోలు గత డిసెంబర్31తో ముగిసిన మూడవ త్రైమాసికానికి సంబంధించిన కన్సాలిడేటెడ్ ఫలితాలు ప్రకటించింది. ఈ ఫలితాల ప్రకారం, ఈ వ్యవధిలో సంస్థ రెవెన్యూ 32శాతం, నికర లాభం 42 శాతం మేర వృద్ధి చెందాయి. సంస్థ నికర లాభం రూ. 52.6. లక్షలుగా నమోదైంది. అమ్మకాలు రూ. 1020.1 లక్షలుగా నమోదయ్యాయి. వ్యర్థ జలాల నిర్వహణ సంస్థ ఎంజోటెక్ సొల్యూషన్స్‌ను కొనుగోలు చేయాలని ప్రతిపాదించింది. బంకా బయోలూ సిఇఓ విశాల్ మురార్కా సంస్థ కొనుగోలు వ్యూహం గురించి వ్యాఖ్యానిస్తూ, ఎంజో టెక్ సొల్యూషన్స్ కొనుగోలుపై ముందుకు సాగేందుకు బోర్డు సూత్ర ప్రాయంగా ఆమోదం తెలిపిందని చెప్పారు.

# అమరావతి రైతులు 99 శాతం ఏకగ్రీవంగా భూములిచ్చారు: చంద్రబాబు

అమరావతి, మార్చి 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని చేయాలంటూ ఇక్కడి రైతులు 99 శాతం మంది తమ భూములను ల్యాండ్ పూలింగ్ ఇచ్చారని, ప్రపంచంలోనే ఇలా భూములిచ్చిన ఏకైక ప్రాంతం అమరావతి అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వారసత్వాన్ని కాదనుకుని రాజధాని ఏర్పాటు కోసం రైతులు 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని చెప్పారు. మంగళగిరిలో టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. అనంతరం టీడీపీకి చెందిన సర్పంచ్‌లతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు.

ప్రధానమంత్రి మోదీ మొదలుకొని ఎందరో అతిరథ మహారథులు వచ్చి అమరావతి ఏర్పాటు కావాలని ఆకాంక్షించారని చంద్రబాబు చెప్పారు. అయితే, వీటన్నింటిని తోసిరాజని సీఎం జగన్ మూడు ముక్కలాటకు తెరలేపారని దుయ్యబట్టారు. ముంపునకు గురవుతుందని లేనిపోని ఆరోపణలు చేశారని, ఎడారి అని, శ్మశానం అని తప్పుడు మాటలు మాట్లాడి రాజధాని ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. భూమి ఇచ్చిన రైతులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకే పకడ్బందీగా సీఆర్‌డీఏ చట్టం తీసుకొచ్చామని తెలిపారు.

రాజధాని కోసం ఆందోళన చేసిన మహిళల్ని చాలా దారుణంగా అవమానించారని, దుస్తులు చించారని, కొట్టారని చంద్రబాబు చెప్పారు. అయినప్పటికీ ధర్మం, కోసం మహిళలు పోరాడి విజయం సాధించారని కొనియాడారు. న్యాయస్థానం టు దేవస్థానం అంటూ పాదయాత్ర చేపట్టారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచిపోయాయని, ఇంకా ఉన్న ఈ రెండేండ్లలో వారు చేయగలిగింది ఏమీ లేదని వ్యాఖ్యానించారు. వారు తమ చేష్టలతో చరిత్ర హీనులుగా మాత్రం మిగిలిపోవడం ఖాయమన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువైందన్నారు. ఇవాల్టి విజయం 5 కోట్ల తెలుగు ప్రజలదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.




# పిఎమ్-వాణి బిజినెస్ ప్రమోషన్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 3:సికింద్రాబాద్ లోని డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్ కార్యలయం లో ఏర్పాటు చేసిన పబ్లిక్ వైఫై యాక్సెస్ నెట్ వర్క్ ఇంటర్ ఫేజ్ (పిఎమ్ వాణి) - బిజినెస్స్ ప్రమోషన్ ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల టెలికం సలహాదారు శ్రీ అశోక్ కుమార్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో లక్షలాది వైఫై హాట్ స్పాట్ లను సృష్టించేందుకు 'పిఎమ్ వాణి' ప్రాజెక్టు వీలు కల్పిస్తుందని, గ్రామీణ ప్రజలకు బ్రాడ్ బ్యాండ్ ను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు పిఎమ్ వాణి ఉపకరిస్తుందని తెలిపారు. పబ్లిక్ డేటా ఆఫీస్ (పీడీఓ)లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా మొబైల్ డేటాతో పని లేకుండానే ప్రజలకు ఇంటర్ నెట్ అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (టెక్నాలజీ) శ్రీ కె. రాజశేఖర్ మాట్లాడుతూ, 'పిఎం?వాణి'గా వ్యవహరించే ఈ పబ్లిక్ వైఫై యాక్సెస్ నెట్ వర్క్ ఇంటర్ ఫేజ్ లో భాగంగా పబ్లిక్ డేటా ఆఫీస్ (పీడీఓ), పబ్లిక్ డేటా ఆఫీస్ అగ్రిగేటర్లు (పీడీఓఏ) వివిధ వర్గాల భాగస్వామ్యంతో ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

'పిఎమ్-వాణి' ప్రాజెక్టు లో భాగంగా పీడీఓలను ఇప్పుడు ఎవరైనా ఏర్పాటుచేసుకోవడం సులభతరమన్నారు. ఈ వైఫై సెటప్ బాక్స్ లను రూ. 3,000 ? రూ. 12,000 లకు కొనుగోలు చేయవచ్చని శ్రీ కె. రాజశేఖర్ తెలిపారు. వ్యాపారాభివృద్ధి కోసం చిల్లర వర్తకులు, చిరు వ్యాపారస్తులు, ఇంకా నిరుద్యోగులు ఈ పీడీఓలను ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవచ్చని ఆయన తెలిపారు.

డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ జె. రాజారెడ్డి మాట్లాడుతూ, లైసెన్స్ రహిత సంస్థలు అట్టడుగు స్థాయిలో వైఫై సేవలను అందించేందుకు పిఎమ్-వాణి వీలుకల్పిస్తుందనీ, ఈ విధంగా మొబైల్ డేటాతో పని లేకుండానే గ్రామీణ ప్రజలకు ఇంటర్ నెట్ అందుబాటులో ఉంటుందని అన్నారు.

యూజర్లు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవడం కోసం 'పిఎమ్-వాణి' యాప్ (ఖఓ-చింఔవ జీజూజూ) లో తమ వివరాలను నమోదు చేసుకోవలసి ఉంటుంది. పబ్లిక్ డేటా ఆఫీస్ (పీడీఓ) లు ఏర్పాటు చేసుకొనేందుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు సికింద్రాబాద్ లోని డిఓటి కార్యాలయం 040-27897743 నెంబర్ కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చు.

# మంత్రి శ్రీనివాస్ గౌడ్ హత్యకు కుట్ర పన్నడం ఆందోళనకరం : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, మార్చి 3:మంత్రి శ్రీనివాస్ గౌడ్ మీద వెలుగు చూసిన హత్యాయత్నం కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో హింస కు తావులేదు. రాజకీయాల్లో భౌతిక దాడులు సరికాదన్నారు.ఇలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేదని మంత్రి అన్నారు. ప్రజా జీవితం ప్రజల సేవకు అంకితం. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి. తప్పు నేరమయం చేయవద్దన్నారు. అలా ఎవరైనా ఆలోచించినా తప్పే అన్నారు. ప్రజా జీవితంలో ఉండేవాళ్లు, ఉండాలనుకునే వాళ్లు పనిచేసి ప్రజల ఆదరణ పొందాలన్నారు.కానీ రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడాలి అనుకోవడం, హత్యా రాజకీయాలకు కుట్రలు చేయడం ఆక్షేపనీయం. పాలమూరు జిల్లా ప్రశాంతమైన జిల్లా. ఆ వాతావరణం కలుషితం కావద్దు. దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి నిజానిజాలు ప్రజలకు వెల్లడించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

# దాతృత్వాన్ని చాటుకున్న రుద్రవరం ఎంపిటిసి గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్



రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రారం గ్రామ ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ గ్రామంలో శ్రీ భక్త మార్కండేయ దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసి ఎంపీటీసీ దాతృత్వం చాటుకున్నారు .

వేములవాడ అర్బన్ మండలం రుద్రారం ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్ దాతృత్వాన్ని చాటుకున్నారు

గురువారం దేవాలయానికి నిర్మాణానికి 15,116 వేల రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు నిర్మాణానికి సహకారం అందించి తనలో భక్తి భావం కూడా ఉందని నిరూపించారుగ్రామంలో మందిర నిర్మాణ ప్రతిష్ట కార్యానికి ఉడత భక్తి తమ వంతు విరాళాన్ని ఆలయ ట్రస్టు సభ్యులకు సమర్పించినట్టు, ప్రజలందరూ కూడా మందిర నిర్మాణానికి తమకు తోచిన విధంగా విరాళాల్లో అందజేసి ఈ పవిత్ర యజ్ఞం భాగం లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు

# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందనీయం

–మహాశివరాత్రి జాతరలో మూడు రోజుల పాటు విశిష్ట సేవలు అందించిన వారికి చిరుసత్కారం





రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నేటినిజం ప్రతినిధి):మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రికి వేములవాడకు వచ్చిన భక్తులకు దాతలు అందించిన సహకారంతో కొనుగోలు చేసిన వ్యాన్ లోడు అరటిపండ్లు, జువ్వాడి వెంకటేశ్వరరావు, అడ్వకేట్ గారు అందించిన మినరల్ వాటర్ బాటిల్స్ పంపిణీకి సహకరించి, విశిష్ట సేవలు అందించిన ట్రస్టు సభ్యులకు,శ్రేయోభిలాషులకు ఈరోజు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి రాజన్న ప్రసాదం అందజేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథులుగా విచ్చేసిన సీనియర్ జర్నలిస్టు ,కరాటే మాస్టరు ఎంఏ మన్నాన్,సీనియర్ జర్నలిస్టు హింగే శ్రీనివాస్, మన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మోటూరి మధు, తోట లహరి, డాక్టర్ బెజ్జంకి రవీందర్ మాట్లాడుతూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమం, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడం, అలాగే శివరాత్రి మూడురోజుల పాటు సేవలు అందించిన ట్రస్టు సభ్యులను అభినందించారు. మీ ట్రస్టు ద్వారా సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైవేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేష్,గొంగళ్ల రవికుమార్, నాగుల చంద్రశేఖర్, బెజ్జంకి రవీందర్, జూలపెల్లి రాజు,ప్రతాప నటరాజు, పొలాస రాజేందర్, తోట లహరి, ప్రతాప చందన, తాళ్లపల్లి ప్రశాంత్, రిటైర్డ్ టీచర్ చల్లా సత్తయ్య, గొండ ప్రసాద్, ఓటరికారి చిన్న బాలయ్య, కొప్పుల హనుమాండ్లు, భస్మాంగి బసవరాజు, అవునూరి భాస్కర్, మోటూరి మధు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# మెటావర్స్‌లో వాణిజ్యం చేసేందుకు టెక్ఎంవెర్స్‌ను విడుదల చేసిన టెక్‌మహీంద్రా




హైదరాబాద్, మార్చి 3: డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్,కన్సల్టింగ్ మరియు బిజినెస్ రీ?ఇంజినీరింగ్ సేవలనందించడంలో అగ్రగామి సంస్థ టెక్ మహీంద్రా నేడు టెక్ఎంవెర్స్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. తమ వినియోగదారులకు మెటావర్స్‌లో లీనమయ్యే అనుభవాలను అందించడానికి తమ మెటావర్స్ ప్రాక్టీస్ ఇది. వినియోగదారుల అనుభవాలను సమూలంగా మార్చడంతో పాటుగా వాస్తవ వ్యాపార ఫలితాలను అందించడమే లక్ష్యంగా టెక్ మహీంద్రా తమ ప్రపంచ శ్రేణి నెట్‌వర్క్ మరియు మౌలిక వసతుల సామర్థ్యంతో పాటుగా విస్తృతశ్రేణి కృత్రిమమేథస్సు (ఏఐ), బ్లాక్ చైన్, 5జీ, అగుమెంటెడ్ రియాల్టీ (ఏఆర్), వర్చ్యువల్ రియాల్టీ (వీఆర్) మరియు క్వాంటమ్ కంప్యూటింగ్ సహా తమ మౌలిక సదుపాయాల సామర్థ్యాలతో బీ2బీ వినియోగ కేసులను నిర్మించడానికి లక్ష్యంగా చేసుకుంది.తొలి దశలో, డీలర్‌వెర్స్?మెటావెర్స్ ఆధారిత కాలర్ డీలర్‌షిప్ ; మిడిల్‌మిస్ట్?ఎన్ఎఫ్‌టీ మార్కెట్ ప్లేస్, మెటా బ్యాంక్? ఓ వర్చ్యువల్ బ్యాంక్ మరియు గేమింగ్ సెంటర్ సహా పలు యూజ్ కేస్‌ల ద్వారా మెటావర్స్ అందించిన అవకాశాలపై టెక్ మహీంద్రా ఆధారపడుతుంది. ఇది లీనమయ్యే డిజిటల్ మరియు ప్రొఫెషనల్ అనుభవ సేవలను డిజైన్, కంటెంట్, అలాగే అతి తక్కువ కోడ్ ప్లగ్ అండ్ ప్లే నాన్ ఫంగిబల్ టోకెన్స్ (ఎన్ఎఫ్‌టీ) మరియు బ్లాక్‌చైన్ ప్లాట్‌ఫామ్‌ల చుట్టూ అందిస్తుంది. అదే సమయంలో మెటావర్స్ వ్యూహం, టెక్ మహీంద్రా యొక్క డిజిటల్ మరియ పర్యావరణ, సామాజిక, పరిపాలన లక్ష్యాలు (ఈఎస్‌జీ)కు అనుగుణంగా ఉంటాయి. అంతేకాదు, టెక్ మహీంద్రా ఇప్పుడు మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్‌తో భాగస్వామ్యం చేసుకుని ప్రత్యేకమైన డిజిటల్ కలెక్టిబల్స్‌ను అందిస్తుంది. ఇది రెండవ స్థిరమైన బ్రాండ్‌తో ఒకదానితో ఒకటి ఆధారపడిన సిరీస్‌తో ప్రారంభమవుతుంది. ఈ కలెక్టబల్స్‌ను టెక్ మహీంద్రా యొక్క సుప్రసిద్ధ ఎన్ఎఫ్‌టీ మార్కెట్ ప్లేస్ ప్లాట్‌ఫామ్ ద్వారా జాబితా చేయడం, ముద్రించడం మరియు విక్రయించడం చేస్తారు.టెక్ మహీంద్రా ఎండీ అండ్ సీఈవో సీపీ గుర్నానీ మాట్లాడుతూ "మన వాస్తవికతతో పాటుగా భవిష్యత్‌ను సైతం మంచి కోసం సమూలంగా మార్చే శక్తి మెటావర్స్‌కు ఉంది. టెక్ మహీంద్రా వద్ద, మేమెప్పుడూ కూడా 5జీకి సిద్ధంగా ఉంటూనే ఉన్నాం మరియు భవిష్యత్‌కు సిద్ధంగా ఉండటంలో మా ప్రయాణంలో మరో మైలురాయిగా మెటావర్స్ నిలువడంతో పాటుగా మా వినియోగదారుల అనుభవాలను సైతం సమూలంగా మార్చనుంది. మెటావర్స్ యొక్క ప్రాథమిక లేయర్లు టెక్ మహీంద్రా మరియు దాని సామర్థ్యంలలో బాగా కలిసి పోయాయి. మౌలిక సదుపాయాల నుంచి అనుభవాల వరకూ, ప్రాదేశిక కంప్యూటింగ్ నుంచి ఇప్పుడు వాణిజ్యం వరకూ టెక్ మహీంద్రా యొక్క ప్లాట్‌ఫామ్ టెక్ఎంవెర్స్ ఇప్పుడు అత్యంత సౌకర్యవంతమైన రీతిలో ఇంటిగ్రేషన్‌ను 5జీ లోమా అనుభవాన్ని ఏఐ, ఏఆర్/వీఆర్ మరియు బ్లాక్ చైన్‌లో మా నైపుణ్యంతో మిళితం చేసేందుకు తోడ్పడుతుంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com